నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.com
http://nirbhayavaartha.com

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY

**విలేకరులు కావలెను**
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న "నిర్భయవార్త" తెలుగు దినపత్రికకు జర్నలిజంపై ఆసక్తి కలిగి, అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్‌సి ఇంచార్జీలు మండలాల వారిగా విలేకరులు కావలెను.
సంప్రదించండి
సెల్ : 7799013939

సంపుటి :12 సంచిక :318 రంగారెడ్డి | శుక్రవారం 13 మార్చి 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | పేజీలు : 8 | వెల : రూ।। 1-00
Circulated To : ★ Hyderabad ★ Ranga Reddy ★ Nizamabad ★ Warangal ★ Mulugu ★ Shadnagar ★ Yadadri ★ Nalgonda ★ Karimnagar ★ Khammam ★ Medak ★ Sangareddy ★ Siddipet ★ Medchal ★ Jagityal ★ Vemulawada

## ప్రతి దేశానికి పునాది దాని ఇంధన భద్రతే : రాహుల్‌గాంధీ



ఢిల్లీ, నిర్భయవార్త : ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర సర్కారుపై లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. గురువారం లోక్‌సభలో మాట్లాడిన ఆయన.. ఇంధన భద్రత విషయంలో భారత ప్రభుత్వం అమెరికాతో రాజీపడిందని ఆరోపించారు. ఈ రాజీతో వివిధ చమురు సరఫరాదారులతో తన సంబంధాలను నిర్ణయించే అధికారాన్ని అమెరికాకు కట్టబెట్టినట్లు అయ్యిందనిఆయన మండిపడ్డారు. అమెరికా – ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంతో భారత్ సుదీర్ఘ పరిణామాలనుఎదుర్కోవాల్సి వస్తుందని రాహుల్‌గాంధీ చెప్పారు. ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం హోర్ముజ్‌జలసంధి గుండా జరుగుతుందని, జీవనాడి లాంటి ఆ జలసంధి మూతపడటం తీవ్ర పరిణామాలకుదారితీస్తుందని అన్నారు. ముఖ్యంగా భారత్‌కు ఎక్కువ ఇబ్బందులు కలుగనున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఎందుకంటే మనం దిగుమతి చేసుకునే చమురు, సహజవాయువులో సింహభాగం హోర్ముజ్ జలసంధి నుంచే సరఫరా అవుతుందని చెప్పారు. నొప్పి ఇప్పుడిప్పుడే ప్రారంభమైందని, గ్యాస్ కొరత కారణంగా ఇప్పటికే రెస్టారెంట్‌లు మూతపడుతున్నాయని రాహుల్‌గాంధీ అన్నారు. వీధి వ్యాపారులపై గ్యాస్ కొరత తీవ్ర ప్రభావం చూపుతున్నదని వ్యాఖ్యానించారు. ప్రతి దేశానికి పునాది దాని ఇంధన భద్రతేనని ఆయన నొక్కి చెప్పారు. ఇది చిన్న విషయం కాదని, మనం ఎక్కడి నుంచి చమురు కొనుగోలు చేయాలి..? రష్యా నుంచి కొనాలా వద్దా అనేవి అమెరికా నిర్ణయించడం ప్రమాదకరమని అన్నారు.



# హైదరాబాద్‌కు.. హాలీవుడ్!

## నెట్ ఫ్లిక్స్ రూపంలో రాక

- తెలంగాణకు రావడంపై సీఎం రేవంత్ హర్షం
- సంస్థ విస్తరణకు అన్నివిధాల సహకరిస్తాం
- ఫ్యూచర్ సిటీలో స్థలం కూడా ఇస్తాం
- ఐలైన్ స్టూడియో ప్రారంభ సభలో సీఎం భరోసా

హైదరాబాద్, నిర్భయవార్త ప్రతినిధి :నెట్ ఫ్లిక్స్ రావడం అంటే హైదరాబాద్‌కు హాలీవుడ్ రావడమేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నెట్‌ఫ్లిక్స్‌తో తన కల నిజం కాబోతుందన్నారు. హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని సీఎం గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు, సినీ నటుడు రానా దగ్గుబాటి, నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ సీఈవో శ్రీ జెఫ్ షాపిరో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ, నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ విస్తరణకు తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఫోర్త్ సిటీని నిర్మిస్తున్నామని.. నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు కావాల్సిన భూమిని ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నెట్ ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్‌ను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని కోరారు.

### 500 పెద్ద కంపెనీలను తెస్తాం..

తనకు సినిమాలపైన ఆసక్తి ఉందని.. తన బాల్యం నుంచి ఇప్పటి వరకు సినిమాలో అనేక మార్పులు వచ్చాయని ప్రస్తావించారు. బహుబలి, కల్కి, ఆర్ఆర్ఆర్, అరుంధతి వంటి అత్యనున్నత సాంకేతికతో కూడిన సినిమాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. చెన్నైలో ఉన్న సినిమాను నందమూరి తారక రామారావు , అక్కినేని నాగేశ్వరరావు హైదరాబాద్‌కు తీసుకువచ్చారని గుర్తుచేశారు. తమ దృష్టి హాలివుడ్‌పైననే అని తాను గతంలోనే చెప్పానని ప్రస్తావించారు. ప్రపంచంలో ఉన్న 500 పెద్ద కంపెనీలు తెలంగాణకు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో మీ పెట్టుబడికి పూర్తి రక్షణ ఉంటుందని భరోసా కల్పించారు. తెలంగాణ అంటేనే వ్యాపారమని సీఎం పేర్కొన్నారు.

(మిగతా 5లో..)

# డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదు: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, మార్చి12 నిర్భయవార్త ప్రతినిధి : తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 శాతం మాత్రమే కమర్షియల్ అని వివరించారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని తమ శాఖ అధికారులు వెల్లడించారని చెప్పారు. కానీ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది వాస్తవమని తెలిపారు. రాష్ట్రంలో వంట గ్యాస్ తాజా పరిస్థితిపై చర్చించేందుకే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షిస్తామని మంత్రి ఉత్తమ్ వివరించారు. రాష్ట్రంలో రోజూ ఎన్ని కమర్షియల్ సిలిండర్లు అవసరం, సరఫరా ఏ మేరకు ఉంది, గ్యాస్ కొరతకు గల కారణాలు, అందుకు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టేందుకున్న మార్గాలన్నింటిపై చర్చించనున్నట్లు మంత్రి ఉత్తమ్ వివరించారు. అలాగే పూర్తి వివరాలతో రావాలని ఆయిల్ కంపెనీల ప్రతినిధులతోపాటు అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. మరో వైపు.. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు కొనసాగుతోంది. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా గ్యాస్, చమురుకు తీవ్ర



కొరత ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తెలంగాణలో వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో హోటళ్లు, హాస్టల్స్, మెస్‌లకు అవసరమైన మేర కమర్షియల్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో నగరంలో చాలా ప్రాంతాల్లో అవి మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందుకోసం శుక్రవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు.

# యూరియా కోసం కేంద్రానికి లేఖ: మంత్రి తుమ్మల



హైదరాబాద్, మార్చి 12 నిర్భయవార్త ప్రతినిధి : ఈ ఏడాది ఖరీఫ్ కోసం ముందస్తుగా యూరియా నిల్వలు సిద్ధం చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది ఈ నేపథ్యంలో రానున్న మూడు నెలలకు.. ఆరు లక్షల మెట్రిక్ టన్నులు యూరియా కేటాయించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఏప్రిల్, మే, జూన్‌కు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు లేఖ రాసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం హైదరాబాద్‌లో వెల్లడించారు. ఖరీఫ్ ప్రారంభానికి రాష్ట్రంలో సుమారు 50 వేల టన్నుల ప్రారంభ నిల్వలు మాత్రమే ఉండే అవకాశం ఉందన్నారు. తెలంగాణలో 70 శాతం పంటలు ఖరీఫ్ సీజన్‌లోనే సాగవుతాయని మంత్రి తుమ్మల వివరించారు. జూలై, ఆగస్టులలో యూరియా డిమాండ్ గరిష్టంగా పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. నెలకు సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల అవసరమవుతుందని చెప్పారు. ఎరువుల పంపిణీ పారదర్శకతకు యూరియా యాప్ తీసుకొచ్చినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేశారు.

## హోర్ముజ్ జలసంధిలో

# భారత నౌకలకు రైట్ రైట్?




ముంబై, మార్చి 12 నిర్భయవార్త : అమెరికా, ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అయితే ఇరాన్ ఆధీనంలోని హోర్మూజ్ జలసంధిని ఒక ఆయిల్ ట్యాంకర్ సురక్షితంగా దాటింది. క్షిపణులు, డ్రోన్ దాడుల నుంచి తప్పించుకుని భారత్ చేరుకున్నది. లైబీరియా జెండా కలిగిన చమురు ట్యాంకర్ షెన్‌లాంగ్ సూయెజ్‌మాక్స్ బుధవారం ఉదయం ముంబై పోర్ట్‌కు చేరుకున్నది. మార్చి 1న సౌదీ అరేబియాలోని రాస్ తనురా షిప్‌యార్డ్ నుంచి ఇది బయలు దేరింది. 1,35,335 మెట్రిక్ టన్నుల క్రూడ్ ఆయిల్‌ను భారత్‌కు దిగుమతి చేసింది. కాగా, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో కీలకమైన హోర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఆంక్షలు విధించింది. తమ అనుమతి లేకుండా ఈ మార్గంగుండా వెళ్లే నౌకలపై దాడులు చేస్తామని హెచ్చరించింది. దీంతో హోర్మూజ్ జలసంధికి ఇరువైపులా అనేక ఆయిల్ ట్యాంకర్లు, కార్గో షిప్‌లు నిలిచిపోయాయి. మరోవైపు అమెరికాతో సహా పలు దేశాలకు చెందిన కొన్ని ఆయిల్ ట్యాంకర్లపై ఇరాన్ క్షిపణులతో దాడులు చేసింది. ఇలాంటి యుద్ధ పరిస్థితుల్లో లైబీరియా ఆయిల్ ట్యాంకర్ చాకచక్యంగా హోర్మూజ్ జలసంధిని దాటింది. ముంబై పోర్ట్‌లోని జవహర్ ద్వీప్ టెర్మినల్‌కు బుధవారం ఉదయం సురక్షితంగా చేరుకున్నది. దేశంలో చమురు సంక్షోభం నెలకొన్న తరుణంలో తొలి ఆయిల్ ట్యాంకర్ భారత్ చేరడం ఊరట నిచ్చింది.

నిర్భయవార్త


సంపాదకీయం

శుక్రవారం 13, మార్చి 2026

# కార్యాచరణ కావాలి..

రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు వేసవి ప్రణాళికను ప్రకటించింది. 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్-2026' పేరుతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ రూపొందించిన ఈ ప్రణాళికలో వడదెబ్బ కారణంగా రాష్ట్రంలో ఒక్క ప్రాణం కూడా పోకుండా చూడాలని అధికార యంత్రాంగానికి నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం ప్రకటించారు. ఈ దిశలో జిల్లాల కలెక్టర్లకు కొన్ని నిర్దిష్ట సూచనలను కూడా ప్రణాళికలో పేర్కొన్నారు. అయితే, రాష్ట్రంలో ఇప్పటికే ఎండలు మండుతున్నాయి. ఫిబ్రవరి నెలాఖరులోనే వేసవిని తలపించింది. ఈ నెల మొదటి వారంలోనే రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నెల్లూరు జిల్లా కావలిలో ఆరవ తేదీన 40డిగ్రీలు, ఒంగోలు, తిరుపతి, కర్నూలు, అమరావతి వంటి ప్రాంతాల్లో 38-39 డిగ్రీలు ఉష్ణోగ్రతలు చోటుచేసుకున్నాయి. రానున్న రోజుల్లో మరో రెండు, మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అంటే, 42 నుండి 43 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరుకునే అవకాశం ఉందని అర్ధం. మార్చి నెల ప్రథమార్ధంలోనే ఈ స్థాయిలో ఎండలు ఉంటే, ఏప్రిల్, మే నెలల్లో ఏ స్థాయికి చేరుతాయో అర్ధం చేసుకోవచ్చు. గత కొన్ని సంవత్సరాలుగా నెలకొంటున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుంటే రాష్ట్రంలో ఇప్పటికే కార్యాచరణ ప్రారంభమై ఉండాలి. కానీ, అలా జరగలేదు. ఇప్పటికైనా ప్రణాళికను ఆవిష్కరించారు కనుక ఆ దిశలో ప్రభుత్వ అడుగులు వేగంగా పడాలి. వడదెబ్బ బాధితుల కోసం ఆస్పత్రులలో ప్రత్యేక బెడ్లు, మందులు సిద్ధం చేయాలని, తాగునీటి సరఫరా నిరంతరం కొనసాగాలని, మార్కెట్లు, బస్టాండ్లు, ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, వృద్ధులు, చిన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని ప్రణాళికలో పేర్కొనడం మంచిదే! అయితే, ఇలాంటి ప్రణాళికలు గతంలోనూ ప్రకటించడం, అమలులో అనేక లోపాలు బయటపడటం విస్మరించకూడదు. ప్రణాళిల్లో పేర్కొన్న అంశాలు ఎలా ఉన్నప్పటికీ వాటి అమలుకు చాలినన్ని నిధులు అందుబాటులో ఉండకపోవడం గతంలో అనేక సందర్భాల్లో కీలకాంశంగా ముందుకు వచ్చింది. నిధుల కొరత కారణంగానే అనేక స్థానిక సంస్థలు తాగునీటిని కూడా సక్రమంగా సరఫరా చేయలేని ఉదాహరణలు కోకొల్లలు! ఆసుపత్రులలో బెడ్లు, మందుల పరిస్థితి కూడా ఇంతే! అందువల్ల నిధుల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. వేసవి కష్టాలను ఎదుర్కోవడం కేవలం విపత్తు నిర్వహణ శాఖ బాధ్యత మాత్రమే కాదు. అనేక శాఖలు సమన్వయంతో దీనిని సాధించాలి. ఎండలు తీవ్రమౌతున్న నేపథ్యంలో పాఠశాలల సమయాలు మార్చడం వంటి అంశాలను ప్రభుత్వం తక్షణం పరిగణలోకి తీసుకోవాలి. వేసవి తీవ్రత పెరిగే కొద్దీ శ్రమ జీవుల కష్టాలు కూడా తీవ్రమవుతాయి. ఉపాధి హామీ పేదలు, వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, హమాలీల పై ప్రభావం తీవ్రంగా ఉంటుంది. మధ్యాహ్న సమయాల్లో పనిచేయాల్సి రావడం ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదంగా మారుతోంది. ప్రతి సంవత్సరం వడదెబ్బ బారిన పడుతున్న వారిలోనూ, ప్రాణాలు కోల్పోతున్న వారిలోనూ పెద్ద సంఖ్యలో ఉపాది హామీ కార్మికులు ఉండటం గమనార్హం. దీనిని పరిగణనలోకి తీసుకుని ఉపాధి పనుల వేళలను తక్షణమే మార్చాలి. అలాగే ఉపాధి పనులు జరిగే చోట తాగునీటిని అందుబాటులో ఉంచడంతో పాటు, షామియానాలు వంటి అవసరమైన ఇతర జాగ్రత్తలు తీసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులున్న ప్రతిచోటా ఈ తరహా చర్యలను చేపట్టాలి. మహిళా కార్మికులకోసం మరిన్ని ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికలో ఈ కష్టజీవులకు లభించిన స్థానం నామమాత్రమే! ప్రభుత్వం వీరి భద్రత కోసం మరింతగా దృష్టి సారించాల్సి ఉంది. వేసవి కాలంలో అగ్నిమాపక శాఖ ప్రాధాన్యతను, నగరాలు, పట్టణాల్లో హరిత వాతావరణాన్ని పెంచడం, కాలుష్యాన్ని నివారించడం, మొక్కలు పెంచడం వంటి చర్యల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఏమైనప్పటికీ, ఈ తరహా చర్యలు కాగితాలకే పరిమితమైతే ఎటువంటి ప్రయోజనం లేదు. కార్యాచరణలో కనిపించినప్పుడే ప్రజలకు రక్షణ లభిస్తుంది.

# వ్యవసాయంలో ముంచుకొస్తున్న కార్పొరేట్ మేఘాలు




భారత వ్యవసాయ రంగం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మార్పు చెందడానికి వీలుగా ఎన్డీఏ 3.0 ప్రభుత్వం 8 బిల్లులను పార్లమెంటులో ప్రవేశ పెట్టడం, కొన్ని బిల్లులు ఆమోదం పొందడం కూడా జరిగిపోయింది. కానీ రాష్ట్ర అసెంబ్లీలో మాత్రం రైతుల కోసం ఎ.పి ప్రభుత్వం అంకితమైనట్లుగా ముఖ్యమంత్రి ఉపన్యాసాలు సాగుతున్నాయి. ఇది ఒక దగా. గత కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి, గ్రామీణ ప్రాంతానికి సంబంధించి మూడు పద్దులను (రూ.60 వేల కోట్ల వరకు) కేంద్ర ప్రభుత్వం ఖర్చు పెట్టనేలేదు. ఈ సంవత్సరం అందుకు భిన్నంగా జరుగుతుందని ఆశించలేం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంవత్సరం బడ్జెట్లో ధరల స్థిరీకరణ కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. కేంద్రం ఎఫ్‌సిఐ ద్వారా వివిధ రాష్ట్రాల నుంచి కొనాల్సిన కందులు, శనగలు, పెసలు, మొక్కజొన్నలు లాంటి 25 రకాల పంటలను కొనడానికి నిరాకరించింది. దేశంలోని 24 వేల స్థానిక మార్కెట్లు, 125 ప్రత్యేక మార్కెట్ల నిర్వహణను వదిలేయడమేగాక...ప్రైవేటు వ్యక్తులు కంపెనీలు, మార్కెట్లు పెట్టుకునేందుకు అనుమతించే బిల్లును గత ఫిబ్రవరిలో పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకుంది. రాష్ట్రం నుంచి ఎన్డీఏ, వైసిపి ఎంపీలందరూ దీనికి ఆమోదం తెలపడం చూశాం. గత రెండు సంవత్సరాలుగా వరి ధాన్యం, పత్తి, మిర్చి, పొగాకు, ఉల్లిపాయలు, కోకో లాంటి పంటలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలకు కొనేవారే లేరు. తక్కువ ధరలకు రైతులు అమ్ముకోవలసి వస్తున్నది. ఢిల్లీలో వ్యవసాయాన్ని నాశనం చేసే చట్టాలు చేయడం, అసెంబ్లీలో వ్యవసాయ ధరలు లేక రైతులు బాధపడుతున్నారని మొసలి కన్నీరు కార్చడం అలవాటైపోయింది. చంద్రబాబు నాయుడు రాష్ట్ర అసెంబ్లీలో 'డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్' పత్రాన్ని ప్రవేశ పెట్టినప్పుడు కొన్ని ముఖ్యాంశాలను ప్రస్తావించారు. స్వర్ణాంధ్ర 2047 సాధించే సమయానికి వ్యవసాయ రంగంపై ఆధారపడే జనాభా 60 శాతం నుండి 10 శాతానికి పడిపోతుందట. నేడున్న వ్యవసాయ భూములు కూడా 30 శాతం చాలట. మిగతాది అవసరం లేదట. అంటే ఎవరికైనా అమ్ముకోవచ్చన్నమాట. వ్యవసాయ రంగంలో మిగిలిపోయే మిగతా 50 శాతం జనాభాను పట్టణాలకు రప్పించుకొని చీప్ లేబర్‌గా వాడుకోవచ్చన్నది పాలకవర్గాల ఆలోచన. అందుకుగాను ఈ ప్రాజెక్టును ముందుకు తెస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం సైతం ఈ సంవత్సరం 100 లక్షల ఎకరాలను అమ్మకానికి సిద్ధం చేసింది. 'నూతన నీటి విధానం' ప్రకారం కాలువలకు, పొలాలకు మీటర్లు పెట్టి నీటి వాడకాన్నిబట్టి రైతుల నుండి చార్జీలు వసూలు చేస్తారు. పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి కంపెనీల నుంచి పెట్టుబడులు ఆహ్వానిస్తారు. ఈ విధానం పేద రైతులకు వ్యతిరేకమైనది. రాష్ట్ర అసెంబ్లీలో సైతం ఈ విధానం పాస్ అయింది. 'విత్తన బిల్లు 2025' చూస్తే రైతులకు ఆందోళన కలుగుతుంది. కంపెనీ దగ్గర కొన్న విత్తనాలు సరిగ్గా మొలవకపోయినా, తగిన దిగబడి రాకపోయినా తర్వాత వ్యవసాయ సీజన్ లోపు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని 2001 విత్తన బిల్లులో ఉంది. కానీ ఈ తాజా బిల్లు ప్రకారం కంపెనీ విత్తనాలు రెండుసార్లు మొలవకపోయినా, సరైన దిగుబడులు రాకపోయినా ఆ రైతులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించనవసరం లేదు. మూడవసారి ఆ కంపెనీ విత్తనాలు విఫలమైతే ఆ కంపెనీ ప్రభుత్వానికి ఫెనాల్టీ చెల్లించాలని బిల్లులో ఉంది కానీ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని లేదు. 'పంటల బీమా చట్టం' కార్పొరేట్ కంపెనీలకు ధీమా కల్పిస్తున్నది కానీ రైతులకు కాదు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఆపరేషన్ గైడ్‌లైన్స్ మాత్రం వివరంగా ఉన్నాయి. ఆచరణలో ఈ పద్దు కింద ప్రతి సంవత్సరం కేటాయించే రూ.15 వేల కోట్లలో ఐదు వేల కోట్లు కూడా రైతులకు చేరడం లేదు. రూ.10 వేల కోట్లను కార్పొరేట్ బీమా కంపెనీలు మింగేస్తున్నాయి. వాతావరణం, క్రాప్ కటింగ్ ఎక్స్‌పరిమెంటేషన్‌లో ప్రైవేట్ కంపెనీల డేటాను వాడుతున్నారు. ప్రభుత్వ వ్యవసాయ బీమా కంపెనీలు డమ్మీలుగా మిగిలిపోతున్నాయి. ప్రైవేట్ కంపెనీదే పెత్తనం, వారే దోచేస్తున్నాం. 'విద్యుత్ సవరణ చట్టం 2025' ప్రకారం మొత్తం విద్యుత్ వ్యవస్థను ప్రైవేటీకరించడం ప్రధానాంశం. ఐదు సంవత్సరాలలో క్రాస్ సబ్సిడీని రద్దు చేయాలనేది మరో కీలకాంశం. ఇది మెట్ట ప్రాంతాలలో, గిరిజన ఏరియాలో, వెనుకబడ్డ ప్రాంతాలలో చిన్న రైతుల పంపుసెట్లు, లిఫ్ట్‌ల వ్యవసాయాన్ని బాగా దెబ్బతీస్తుంది. 'ఎరువుల విధానం 2025' ప్రకారం ఎరువులపై ప్రభుత్వ నియంత్రణ తొలగించారు. సకాలంలో రైతులకు అందక పోయినా, ఉండాల్సిన నాణ్యత లేకపోయినా, ధర పద్ధతులలో తేడాలున్నా ప్రభుత్వ యంత్రాంగానికి బాధ్యత లేదు. ఇప్పుడు ఈ విధానంలో అదనంగా (23 పిఎమ్ (ప్రణామ్)) నానో లిక్విడ్ యూరియాను ప్రవేశ పెట్టింది. దాంట్లో నత్రజని 45 శాతం నుంచి 4 శాతానికి తగ్గుతుంది. యూరియాపై ప్రభుత్వ సబ్సిడీ మొత్తం తగ్గించి నగదు బదిలీ పథకం పెట్టాలని కేంద్రం రాష్ట్రాలను కోరుతోంది. నానో యూరియా తీసుకున్న రాష్ట్రంలో బస్తాకు రూ.800 సబ్సిడీ ఇస్తానని ప్రకటించింది. వ్యవసాయానికి సంబంధించి పురుగు మందులలో అత్యంత దోపిడి జరుగుతున్నది. 100 రూపాయల మందు బుడ్డిని వెయ్యి రూపాయలకు, 300 రుపాయలది 3 వేలకు అమ్ముతూ వ్యాపారస్తులు అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. దీనికి కారణం 'నూతన పురుగు మందుల విధానం'లో ఎం.ఆర్.పి విధానం పాటించాలని లేకపోవడమే. పురుగులను చంపడానికి ఆ ద్రావకంలో ఎంత శాతం మందు ఉండాలో అది ఉండక పోయినా వ్యాపారస్థులను అడిగేవారు లేరు. వి గ్రామ్‌జి పథకం మేడిపండు చందంగా మారడం చూస్తున్నాం. ప్రకృతి విపత్తుల చట్టం 25, సెక్షన్ 12లో బాధితులను ఆదుకోవడానికి వున్న సూచనలు తొలగించారు. సెక్షన్ 13లో పంటలు కోల్పోయిన రైతులకు చెందిన రుణాలు వాయిదా వేసి తిరిగి పంట రుణాలు రీషెడ్యూల్ చేసే చాప్టర్‌ను తొలగించారు. ఈ ఇరవై నెలల్లో ఇన్ని చట్టాలు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి గుండెకాయ లాంటి కౌలు రైతులకు ప్రభుత్వ వ్యవసాయ పథకాలు అందించే చట్టం చేయకపోవడంలో కుట్ర ఉంది. పేద రైతు, కౌలు రైతు కేంద్రంగా ఉన్న వ్యవసాయాన్ని పైచట్టాల ద్వారా కార్పొరేట్లకు కట్టబెట్టడానికి మార్గం సిద్ధం చేస్తున్నారనేది స్పష్టంగా తెలుస్తుంది. వ్యవసాయ సంక్షోభం, యువరైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయేగాని తరగడం లేదు. అందుకుగల కారణాలను, పరిష్కారాలను కనిపెట్టడంలో ప్రభుత్వం వైపు నుండి వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది.

# వందేమాతరం వివాదం ..విజ్ఞత

ఇక మీదట అధికారిక కార్యక్రమాలన్నింటా వందేమాతర గీతంలోని ఆరు చరణాలూ ఆలపించాలనీ, కార్యక్రమానికి విచ్చేసిన వారందరూ గీతాలాపన సాగే సమయంలో లేచి నిలబడాలని కేంద్ర హోంమంత్రిత్వశాఖ 2026 జనవరి 28న జారీ చేసిన ఆదేశాలు దేశభక్తి పూరితమైనవి కానే కాదు. జాతి గౌరవం ముసుగులో రాజ్యాంగ విలువలపై చేస్తున్న దుర్మార్గపు దాడి మాత్రమే. అవునో కాదో అర్థం చేసుకోవడానికి మనం 1937 నాటి రాజ్యాంగ అసెంబ్లీ ఏం నిర్ణయించిందో, బిజోరు ఇమ్మాన్యుయేల్ అండ్ అదర్స్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ అండ్ అదర్స్ కేసులో (1986) సుప్రీంకోర్టు ఏమని తీర్పు ఇచ్చిందో తెలుసుకోవాలి. బలహీనత కాదు విజ్ఞత1937 అక్టోబర్ నెలలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కలకత్తాలో సమావేశమైంది. ఆనాడు చేసిన నిర్ణయాన్ని ఇవాళ కొందరు బుజ్జగింపు చర్యగా ప్రచారం చేస్తున్నారు. కానీ జరిగింది అది కాదు. డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సర్దార్ వల్లభారు పటేల్ బలపరిచారు. మహాత్మా గాంధీ ప్రత్యేక ఆహ్వానితుడిగా ఆ సమావేశానికి హాజరయ్యారు. ఆ తీర్మానాన్ని వర్కింగ్ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది. వందేమాతర గీతంలోని కొన్ని చరణాల పట్ల ముస్లిం సోదరులు లేవనెత్తిన అభ్యంతరాలు సబబైనవే. కాబట్టి జాతీయ సమావేశాల్లో ఎవరికీ అభ్యంతరం లేని ఆ గీతంలోని మొదటి రెండు చరణాలను జాతీయ గీతంగా ఆ తీర్మానం ఆమోదించింది. ఇవాళ దీనిని కొంతమంది పిరికితనంగా అభివర్ణిస్తున్నారు. కానీ ఆ నిర్ణయం ప్రాప్తకాలజ్ఞతతో కూడినది. బంకించంద్ర ఛటర్జీ రాసిన గీతంలో తరువాయి చరణాలలో హిందూ దేవతలైన దుర్గ, లక్ష్మి, సరస్వతుల గురించి ప్రస్తావించారు. ఒక చరణంలో అయితే 'త్వం హి దుర్గా, దళ ప్రహరణ ధారిణి' (దశాయుధాలు ధరించిన ఓ దుర్గామాత) అంటూ మాతృభూమిని పోల్చారు. రవీంద్రనాథ్ టాగూర్ కూడా వందేమాతర గీతాన్ని మొదటి రెండు చరణాలకే పరిమితం చెయ్యడాన్ని సమర్థించారు. దేశ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న మధ్యేవాదుల నుండి అతివాదుల వరకు, లౌకిక భావజాలానికి కట్టుబడి ఉన్నవారి నుండి పరమ భక్తుల వరకూ అందరూ ఈ మొదటి రెండు పాదాలూ ఎవరి వ్యక్తిగత విశ్వాసాలనూ కించపరచకుండా ఎంతో స్ఫూర్తివంతంగా ఉన్నాయని భావించారు. ఇది లొంగుబాటు కాదు, దేశ స్వాతంత్ర్యం కోసం ఉద్యమించిన సమస్త ప్రజానీకపు సమిష్టి విజ్ఞత. 1950 జనవరి 24న నాటి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ 'జనగణమణ' మన జాతీయ గీతం అని ప్రకటిస్తూ 'వందేమాతర' గీతాన్ని కూడా సరిసమానంగా గౌరవిద్దాం అని స్పష్టం చేశారు. రాజ్యాంగ అసెంబ్లీ వందేమాతర గీతం లోని మొదటి రెండు చరణాలనే జాతీయ గీతంగా గుర్తించింది. మిగిలిన నాలుగు చరణాలనూ ప్రమాదవశాత్తూ మరిచిపోవడం అంటూ జరగలేదు. లౌకిక రాజ్యంలో నిర్దిష్ట మత దేవతలను అధికారిక చిహ్నాలుగా చేపట్టడం సరికాదన్న స్పష్టమైన అవగాహనతోనే మన జాతి నిర్మాతలు ఆ నాలుగు చరణాలను వదలిపెట్టారు. మన రాజ్యాంగంలోని 51ఎ(ఎ) అధికరణం దేశంలోని ప్రతి పౌరుడూ జాతీయ జెండాకు, జాతీయ గీతానికి కట్టుబడి ఉండాలని పేర్కొంటుంది. జాగ్రత్తగా గమనిస్తే ఈ అధికరణంలో ఏది జాతీయగీతం అన్న స్పష్టత లేకపోవడం గుర్తించవచ్చు. 1976లో చేపట్టిన 42వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు పౌరుల ప్రాథమిక బాధ్యతలను రూపొందించింది. ఇందులో కూడా జాతీయ జెండా, జాతీయ గీతాలను గౌరవించాలన్నది పౌర బాధ్యతగా చేర్చారు. కానీ జాతీయ పాటను చేర్చలేదు. ఇది పొరబాటున జరిగింది కాదు. స్పష్టమైన ఎంపిక. జాతి గౌరవాన్ని అగౌరవపరచడాన్ని నివారించే పేరిట 1971లో ఒక చట్టం తీసుకు వచ్చారు. జాతీయ గీతం, జాతీయ జెండా, రాజ్యాంగం-ఈ మూడింటినీ ఆ చట్టం పరిధి కిందకు తీసుకు వచ్చారు. ఈ చట్టంలో కూడా వందేమాతర గీతాన్ని ప్రస్తావించలేదు. కాబట్టి ఈ గీతాన్ని ఆలపించకపోతేనో లేక ఈ గీతాలాపన సందర్భంగా లేచి నిలబడకపోతేనో అది ఆ గీతాన్ని అవమానించినట్లు పరిగణించి...చట్ట పరంగా అలాంటి వారి మీద చర్య తీసుకోవడానికి ఆస్కారం లేదు. కాబట్టి ఇది యాదృచ్ఛికం కానే కాదు. రాజ్యాంగ చట్రం జాతీయ గీతానికి, పాటకు మధ్య ఉన్న తేడాను స్పష్టంగా గుర్తించినందునే అలా నిర్ణయించారు. నిరాకరించే హక్కుకు సంబంధించిన కేసు...1985 జులైలో కేరళలో బిజోరు, బిను మోల్, బిందు ఇమ్మాన్యుయేల్ పేరుగల ముగ్గురు పిల్లలను స్కూలు నుండి బహిష్కరించారు. వీళ్ళు ముగ్గురూ యెహోవా ఆరాధకులు. ప్రతి రోజూ అసెంబ్లీలో జాతీయ గీతాలాపన జరిగేటప్పుడు వీళ్ళు కూడా గౌరవంగా నిలబడి ఉండేవారు. కానీ గీతాన్ని ఆలపించే వారు కాదు. వీళ్లు అనుసరించే మత విశ్వాసం అందుకు అనుమతించదు. ఆ పిల్లలు ఎవరినీ ఆటంకపరచలేదు. ఎలాంటి గొడవ చేయలేదు. ఆ రాష్ట్ర మంత్రి ఒకరు జోక్యం చేసుకుని ఆ ముగ్గురు పిల్లలను స్కూలు నుండి బహిష్కరింపచేశారు. కేరళ రాష్ట్ర హైకోర్టు ఇందులో తప్పేం లేదని భావించింది, కానీ సుప్రీంకోర్టు ఇది తప్పని తేల్చి చెప్పింది. 'ఆ ముగ్గురు పిల్లలను స్కూలు నుండి బహిష్కరించడం ద్వారా రాజ్యాంగం ఈ దేశంలో ప్రతి పౌరుడికి ఇచ్చిన మత స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్య హక్కులను హరించివేశారు' అని జస్టిస్ ఒ.చిన్నపరెడ్డి తీర్పు చెప్పారు. 'జాతీయ గీతం ఆలపించినప్పుడు గౌరవ సూచకంగా నిలబడే ఉన్నారు. ఆ గీతంతో గొంతు కలవకపోవడం జాతీయ గీతాన్ని అగౌరవపరచడంగా భావించకూడదు' అని శిలాశాసనం లాంటి మాట చెప్పారు. 'జాతీయ గీతాన్ని ఆలపించకపోవడాన్ని అగౌరవంగా భావించడం సరికాదు. గౌరవపూర్వకంగా నిలబడి, మౌనంగా ఉండడం ఏ చట్టాన్నీ ఉల్లంఘించినట్లు కాదు. పిల్లలు మౌనంగా ఉండిపోవడం వాళ్ళ వాక్ స్వాతంత్ర్యపు హక్కులో భాగమే. రాజ్యాంగపరంగా వారికి ఆ హక్కుల రక్షణ లభిస్తుంది' అని న్యాయమూర్తి ఆ తీర్పులో వివరించారు.

# క్రీడాకారులను అభినందించిన ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్







భద్రాచలం 12 మార్చ్ నిర్భయ వార్త ప్రతినిధి: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువు పూర్తి చేసుకున్న ఆలెం వెంకట ప్రసాద్, కురుస నవీన్ వివిధ క్రీడలలో పాల్గొని ముఖ్యంగా రెజ్లింగ్ క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రస్థాయిలోనే కాక అంతర్జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొనడం చాలా సంతోషకరమని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. గురువారం తన చాంబర్లో ఈనెల 25 నుండి వచ్చేనెల 04వ తేదీ వరకు చతిస్గడ్ రాష్ట్రం, సుర్గుజ గ్రామంలోని గాంధీ స్టేడియంలో జరుగు ఆలిండియా ట్రైబల్ కెలో ఇండియా రెజ్లింగ్ క్రీడలలో పాల్గొంటున్నందున ఐటీడీఏ ద్వారా రెజ్లింగ్ క్రీడలకు సంబంధించిన కిట్టును ఆలెం వెంకటప్రసాద్, కుర్స నవీన్ లకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెజ్లింగ్ క్రీడలను ప్రాచర్యంలోకి తేవడానికి మీలాంటి యువకులు ముందుకు రావాలని, కే లో ఇండియా క్రీడలలో పాల్గొంటున్నందున తప్పనిసరిగా పథకాలు సాధించాలని తెలుపుతూ గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలో త్వరలో రెజ్లింగ్ క్రీడలను ప్రవేశపెడతామని, తప్పనిసరిగా క్రీడా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు రెజ్లింగ్ క్రీడలలో ఉన్న మెలకువలను వారికి అందించి జాతీయస్థాయిలో పాల్గొనే విధంగా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో క్రీడల అధికారి గోపాలరావు, ఏ ఎస్ ఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సై కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాజ్ కుమార్.



సింగరేణి మార్చి 12 నిర్భయవార్త రిపోర్టర్. కారేపల్లి ఎస్సై బైరు గోపి జన్మదిన సందర్భంగా సింగరేణి మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఇస్లావత్ రాజకుమార్ స్వయంగా కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఇస్లావత్ రాజ్ కుమార్ మాట్లాడుతూ ఎస్సై బైరు గోపి ఇలాంటి మరెన్నో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలని ప్రార్థిస్తూ పోలీస్ నిఘ నేత్రంలో , శాంతి భద్రతల పరిరక్షణలో ఎస్సై పాత్ర మరువలేనిదని తెలిపారు.

# సర్పంచ్ బాబురావు మృతదేహానికి నివాళి.



సింగరేణి మార్చి 12 నిర్భయవార్త రిపోర్టర్. :పాత కమలాపురం సర్పంచ్ తేజవత్ బాబు రావు హార్ట్ స్ట్రోక్ తో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట మార్కెఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ పాత కమలాపురం చిమనతండ చేరుకొని బాబూరావు బౌతికాయానికి పూలు వేసి నివాళ్ళర్పించారు. ఈ సందర్భంగా బొర్రా మాట్లాడుతూ నూతనంగా సర్పంచ్ గా ఎన్నికైన బాబూరావు అకాల మరణం దురదృష్టకరమని అన్నారు.సర్పంచ్ బాబూరావు కుటుంబానికి రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అండగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతి రావు,మల్లెల నాగేశ్వరావు,గూగులోతు శ్రీను,సర్పంచ్ వడ్డే సులోచన రంగారావు,ఉప సర్పంచ్ దుధిపాళ్ళ భాస్కర్ రావు,ఆవుల సాగర్,పప్పుల నిర్మల,చాందిని,తోటకూర వెంకయ్య,కట్ల శ్రీనివాసరావు,వడ్డే అనంతయ్యమాజీ ఎంపీటీసీ పాండ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి చేయాలి

## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం: కలెక్టర్ మను చౌదరి









మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు.గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్పర్సన్స్, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు మరియు అధికారులకు జిల్లా స్థాయి ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6న ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుందని తెలిపారు. 99 రోజులపాటు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహించే కార్యక్రమాల్లో మొత్తం పది ప్రధాన అంశాలపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా ప్రజా సంక్షేమ పథకాల అమలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ వంటి అంశాలపై అధికారులు ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు.ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడానికి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేస్తేనే ఈ కార్యక్రమం లక్ష్యాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. 99 రోజులపాటు పది అంశాలతో రూపొందించిన కార్యక్రమాలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అమలు చేస్తామని తెలిపారు. ఏప్రిల్ 2న గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించి ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు.కార్యక్రమంలో భాగంగా విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా-యువజన సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోలీస్, రవాణా, ట్రాఫిక్, ఆర్టీసీ శాఖల తరఫున డ్రగ్స్ నియంత్రణ, రహదారి భద్రతపై చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అలాగే వ్యర్థాలను అడవుల్లో వేయకుండా ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అటవీ శాఖ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై రూపొందించిన పాటలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి, డీఆర్ఓ చంద్రవతి, ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ చైర్మన్ నర్సింహ యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీఏ కమిషన్ సభ్యులు జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, నూతనంగా ఎన్నికైన చైర్మన్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ బోర్డ్ - అల్వాల్ జీహెచ్ఎంసీ సరిహద్దులో చెత్త

## పలు కాలనీ ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసన

## ప్రజల ఆరోగ్యం బాధ్యత ఎవరిది? అంటూ స్థానికుల ఆవేదన



అల్వాల్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: కంటోన్మెంట్ బోర్డ్, అల్వాల్ జీహెచ్ఎంసీ సరిహద్దు ప్రాంతాల్లో చెత్త గుట్టలు పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రత్న కాలనీ, సాయిరాం కాలనీ, టీచర్స్ కాలనీ ప్రాంతాల్లో రోడ్డుపైనే పెద్దఎత్తున చెత్త పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఆ మార్గంలో వెళ్లే ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రత్యేకంగా ఈ చెత్త కు కొద్ది దూరంలోనే కంటోన్మెంట్ హాస్పిటల్ ఉండటం స్థానికుల్లో మరింత ఆందోళన కలిగిస్తోంది. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు చెత్త దుర్వాసనతో తీవ్ర అసౌకర్యం ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రి సమీపంలోనే ఈ పరిస్థితి ఉండటం ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక చెత్తలో పడేసిన ప్లాస్టిక్ కవర్లు, ఆహార వ్యర్థాలను మూగజీవాలు తింటుండటంతో వాటి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. ప్లాస్టిక్ కవర్లు తిని మూగజీవాలు అనారోగ్యానికి గురవుతున్నాయని, మరణించే ప్రమాదం కూడా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మూగజీవాలు చనిపోతే దానికి బాధ్యత ఎవరిది అని వారు ప్రశ్నిస్తున్నారు. కంటోన్మెంట్ బోర్డ్, జీహెచ్ఎంసీ అధికారులు పరస్పరం బాధ్యతలు తప్పించుకోవడం వల్లే ఈ సమస్య తలెత్తిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే స్పందించి చెత్తను తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆరోగ్య సిబ్బందికి కీలక సూచనలు..

# రోజువారీ రికార్డులు తప్పనిసరి: ఎన్టీఈపీ అధికారి



పినపాక, మర్చి 12, నిర్భయ వార్త ప్రతినిధి: పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పోతురెడ్డిపల్లి సబ్సెంటర్లో నిర్వహించిన శ్రమదానం, సామూహిక భోజన కార్యక్రమాన్ని గురువారం ఎన్టీఈపీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పుల్లారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్సెంటర్లో ఉన్న ఆరోగ్య సూచికలపై వివరాలు తెలుసుకుని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. రోజువారీ రికార్డులు సక్రమంగా నిర్వహించడంతో పాటు ప్రతి రోజు చివరలో అబ్స్ట్రాక్ట్ నివేదిక సిద్ధం చేయాలని డాక్టర్ దుర్గాభవానికి సూచించారు. అలాగే చికిత్స పొందుతున్న క్షయవ్యాధి (టీబీ) రోగులు, అనుమానిత కుష్టు వ్యాధి కేసులు, గర్భిణీ స్త్రీల వివరాలు తెలుసుకున్నారు. సబ్సెంటర్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పినపాక పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ వేణు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళల ఫిర్యాదుల పరిష్కారానికి ముందుకొచ్చిన జాతీయ మహిళా కమిషన్

## సీపీ కార్యాలయంలో జన్ సున్వాయ్ - అధికారుల సమక్షంలో విచారణ







మల్కాజిగిరి కమిషనరేట్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: దేశం నలుమూలల నుంచి జాతీయ మహిళా కమిషన్‌కు అనేక ఫిర్యాదులు వస్తున్నప్పటికీ, ప్రతి మహిళ ఢిల్లీ వరకు వచ్చి తమ సమస్యలను చెప్పుకోలేరని జాతీయ మహిళా కమిషన్ ఛైర్మన్ విజయ రహత్కర్ అన్నారు. అందుకే మహిళల వద్దకే వెళ్లి వారి సమస్యలను వినేందుకు "జాతీయ మహిళా కమిషన్ మీ చెంతకు" కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. గురువారం మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన మహిళా జన్ సున్వాయ్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, అడిషనల్ డీజీపీ చారుసిన్హా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, మల్కాజిగిరి సీపీ అవినాష్ మహంతి, ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జాతీయ మహిళా కమిషన్ మరియు స్థానిక యంత్రాంగం కలిసి పనిచేస్తే మహిళల సమస్యలకు త్వరగా న్యాయం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా దాదాపు 100 జన్ సున్వాయ్ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా సుమారు 500 జిల్లాల్లో మహిళా జన్ సున్వాయ్ కార్యక్రమాలు నిర్వహించి 15 నుంచి 20 వేల కేసులను పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. మల్కాజిగిరి సీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో 30 కేసులపై విచారణ జరిపినట్లు అధికారులు తెలిపారు. కేసులను త్వరితగతిన పరిశీలించి బాధిత మహిళలకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్పంచ్ మృతి బాధాకరం

## నివాళులర్పించిన మాజీ వైరా ఎమ్మెల్యే రాముల నాయక్



సింగరేణి మార్చి 12 నిర్భయవార్త రిపోర్టర్.: సింగరేణి మండల పరిధిలోని పాత కమలపురం సర్పంచ్ తేజవత్ బాబురావు బుధవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ గురువారం మృతిని ఇంటికి చేరుకొని పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మాజీ ఎంపీటీసీ ధరవత్ పాండ్య నాయక్  ఇంట్లో స్థానిక నాయకులతో కలసి కాసేపు ముచ్చటించారు.  ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వీరన్న, పాండియా నాయక్, రామ్ కిషోర్, కోటి అప్పారావు, నిర్మల స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సామ్రాజ్యవాదం అంతమే ప్రపంచం మ నుగడకు మార్గం

సింగరేణి మార్చి 12 నిర్భయవార్త రిపోర్టర్.: కార్మికుడు,కర్షకుడు, ప్రపంచం మనుగడ సాగించాలంటే అమెరికన్ సామ్రాజ్యవాదం అంతం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు




సత్యనారాయణ అన్నారు. సిపిఎం సింగరేణి మండల కమిటీ సమావేశం కే ఉమాపతి అధ్యక్షతన జరుగుగా ఆయన మాట్లాడుతూ ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధం అనేక అబద్దాలతో ప్రారంభించి ఇతర దేశాల సంపదను ఆక్రమించడం కోసం అన్యాయంగా జరుగుతున్న యుద్ధమని ఇది ప్రపంచంపై అనేక ప్రభావాలు చూపిస్తున్నదని ఈ విషయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం చలనం లేని విధంగా వ్యవహరిస్తున్నదని ఈ కారణంగా గ్యాస్ కొరత ఏర్పడిందని పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతాయని విమర్శించారు. గల్ఫ్ దేశాల ఆయిల్ నిల్వలపై పెత్తనం కోసం అమెరికా ఇజ్రాయిల్ భద్రత పేరుతో చేస్తున్న యుద్ధం భవిష్యత్తులో అనేక అనర్థాలకు అనేక ఉగ్రవాద సంస్థలు పుట్టుకకు దారితీస్తాయని ఇది ప్రపంచ శాంతికి ప్రమాదమని సామ్రాజ్యవాదం మనుగడలో ఉంటే ప్రపంచ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని దోపిడీ పెరుగుతుందని ట్రంపు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉక్రెయిన్ యుద్ధం, గాజులపై ఇజ్రాయిల్ యుద్ధం, వెనిజులా అధ్యక్షుడు మధుర అపహరణ, గ్రీన్ ల్యాండ్ పై బెదిరింపులు చూస్తున్నవేనని వీటికి వ్యతిరేకంగా అలిగిన విధానంతో పోరాడవలసిన భారతు సామ్రాజ్యవాదులకు లొంగిపోయిందని ఇది భారతదేశానికి అనేకమంది శత్రువులను తయారు చేసి పెట్టిందని దీన్ని కప్పిపుచ్చటానికి కులమత ప్రాంతీయ విభేదాలు సృష్టించి విభజించు పాలించు విధానాన్ని అమలు చేస్తున్నదని వీటికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను నిర్మించాలని అదే కమ్యూనిస్టుల ప్రస్తుత కర్తవ్యం అని మెరుగు సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు డివిజన్ కమిటీ సభ్యులు వజ్రామారావు, సీనియర్ నాయకులు తలారి దేవప్రకాష్ మండల కమిటీ సభ్యులు రేగళ్ల మంగయ్య కేశ గాని ఉపేందర్, యనమనగండ్ల రవి, షేక్ సైదులు  పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు

## వర్షాకాలం నాటికి మల్లాయిగూడెం బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి



కూసుమంచి, మార్చి 12 నిర్భయవార్త రిపోర్టర్. : పేదలు ఆత్మ గౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిహా గురువారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి కూసుమంచి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ముందుగా పాలేరు గ్రామంలో మంత్రి వర్యులు పర్యటించి 5 కోట్లతో పాలేరు సరస్సు వద్ద చేపట్టనున్న పర్యాటక సౌకర్యాల అభివృద్ధి పనులకు, మల్లాయి గూడెం గ్రామంలో మల్లాయిగూడెం నుండి ఆంజనేయస్వామి దేవాలయం వరకు కోటి 35 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, గట్టుసింగారం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ నియంత్రికల మరమ్మతుల కేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాలేరు లేక్ ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, ప్రజలు, పర్యాటకులు ఆహ్లాదంగా గడిపే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. లేక్ దగ్గర చేపట్టే పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్లాన్ పరిశీలించిన మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. రాబోయే వర్షాకాలం నాటికి మల్లాయి గూడెం గ్రామంలో కోటి 35 లక్షలతో చేపట్టిన బిటి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. గ్రామాలకు గత నెలన్నర రోజులలో నిధులు విడుదలయ్యాయని, మార్చి 31 లోపు మరిన్ని నిధులు వచ్చే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. గ్రామాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలని అన్నారు. మల్లాయిగూడెం గ్రామ పరిధిలో దాదాపు 13 కోట్ల రూపాయలతో ఇప్పటి వరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. పేదలకు నూతన రేషన్ కార్డులు పంపిణీ, సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లను తప్పనిసరిగా మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఆడ బిడ్డలు ఎంత దూరం ప్రయాణం చేసిన ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించామని, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ అందించామని తెలిపారు. గట్టుసింగారం గ్రామంలో పట్టాలు లేకుండా నిరుపేదలు ఎవరైనా ఉంటే క్షేత్ర స్థాయిలో విచారణ చేసి పట్టాలు అందించాలని అన్నారు. రాబోయే వేసవి కాలంలో త్రాగు నీటి ఇబ్బందులు రాకుండా బోరు మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు. పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ఇందిరమ్మ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు ఈ ప్రభుత్వం చేస్తుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మల్లాయిగూడెం నుంచి ఆంజనేయస్వామి టెంపుల్ వరకు కోటి 35 లక్షల రూపాయలతో చేపట్టిన బీ.టి రోడ్డు నిర్మాణ పనులకు నేడు మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందని, రాబోయే వానాకాలం కంటే ముందే ఈ పనులు పూర్తిచేసి ప్రజలకు రోడ్డును అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్, పాలక వర్గానికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలుపుతూ రాబోయే ఐదు సంవత్సరాలు బాగా పనిచేసి ప్రజలలో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం గట్టు సింగారం వద్ద ఆసుపత్రి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రవి కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు,  పాల్గొన్నారు.

## పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం: ఎంఈఓ జయరాజు



సింగరేణి మార్చి 12 నిర్భయవార్త రిపోర్టర్. సింగరేణి మండలం లో ఈనెల 14 నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు తెలిపారు. మండలంలోని 3 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 581 మంది విద్యార్థి ,విద్యార్థినులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. కారేపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 201 మంది, తెలంగాణ మోడల్ పాఠశాలలో 190 మంది, కోమట్లగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 190 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ప్రతి కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌తో పాటు 9 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తిస్తారని చెప్పారు. పరీక్ష కేంద్రాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటాయని, తెలంగాణ ప్రభుత్వం ఈ సంవత్సరం నూతనంగా పరీక్షా కేంద్రాలకు వస్తున్న విద్యార్థులకు సంబంధించిన వస్తువులను భద్రపరచుకొనుటకు పరీక్షా కేంద్రం సమీపంలో క్లాక్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని. 100 మీటర్ల పరిధిలో సెక్షన్ 144 అమల్లో ఉంటుందని తెలిపారు. అదేవిధంగా పరిష కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో ఎటువంటి జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని లేనిడల వారిపై చర్యలు చేపడం జరుగుతుందని వారు అన్నారు. విద్యార్థులకు  ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ప్రత్యేక వాహనాలు కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

# సర్పంచ్ మృతితో ఎమ్మెల్యే రాందాస్ కన్నీటి పర్యం

**పాడే మోసి నివాళులర్పించిన ఎమ్మెల్యే.**

**లోక సముద్రంలో పాత కమలాపురం గ్రామం.**

**మృతదేహానికి నివాళులర్పించిన సర్పంచులు.**

సింగరేణి మార్చి 12 నిర్భయవార్త రిపోర్టర్.: సింగరేణి మండలం పరిధిలోని పాత కమలాపురం సర్పంచ్ బాబురావు హార్ట్ స్ట్రోక్ తో మరణించడం జరిగింది . విషయం తెలుసుకున్న వైరా శాసనసభలు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎమ్మెల్యే రాందాస్ నాయక్ బాబురావు మృతదేహానికి పూలమాలతో నివాళులర్పించారు. వారి మృతదేహం చూసి కన్నీటిపర్వంతమయ్యారు. అనంతరం అంతిమయాత్రలో వీడ్కోలో పాడే మోసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి వల్ల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికయి అతి తక్కువ సమయంలోనే మరణించడం బాధాకరమని వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సర్పంచు మృతితో తాజా సర్పంచులు , మాజీ, తాజా ప్రజా ప్రతినిధులు నివాళులర్పించారు.



# హైదరాబాద్‌కు హాలీవుడ్

## సృజనాత్మక సాంకేతికతలు, కథన రీతుల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదిగే సామర్థ్యం హైదరాబాదుకు ఉందన్న సంజయ్ జాజు


హైదరాబాద్ మార్చి 12 నిర్భయవార్త సిటీ బ్యూరో నెట్‌ఫ్లిక్స్ గ్లోబల్ ప్రొడక్షన్, ఇన్నొవేషన్ స్టూడియో... ఐలైన్ స్టూడియోస్ ను హైదరాబాద్‌లో ప్రారంభిస్తున్నట్టు ఆ సంస్థ ప్రకటించింది. ఇది దేశంలో నెట్‌ఫ్లిక్స్ పరిధిని మరింత విస్తరించడమే కాకుండా.. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీసీజీ) రంగానికి సంబంధించి ఒక విశేషమైన దీర్ఘకాలిక పెట్టుబడిగా నిలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రొడక్షన్, ఇన్నొవేషన్ వ్యవస్థను విస్తరించుకోవాలన్న నెట్‌ఫ్లిక్స్ వ్యూహంలో భాగంగా ఈ స్టూడియోను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజూ మాట్లాడుతూ.. సృజనాత్మక సాంకేతికతలు, దృశ్య శ్రవ్య కథన రీతులు, డిజిటల్ వినోద రంగాలకు కేంద్రంగా హైదరాబాద్ ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. వేగంగా విస్తరిస్తున్న మీడియా, వినోద రంగ మౌలిక సదుపాయాలతో.. ప్రతిభకూ, ఆవిష్కరణలకూ శక్తిమంతమైన కేంద్రంగా ఈ నగరం నిలిచిందని వ్యాఖ్యానించారు. అద్భుతమైన కథన వారసత్వం భారత్‌కు ఉందనీ, సాంకేతిక పురోగతి వల్ల కథన తీరుతెన్నులూ, వేదికల్లో వేగంగా మార్పులొస్తున్నాయనీ ఆయన అన్నారు. వినోదం నేడు కళ, సాంకేతికతల సమ్మేళనంగా మారిందనీ, ఐలైన్ స్టూడియోస్ వంటి కార్యక్రమాలు భవిష్యత్ కథన రీతులను



తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయనీ పేర్కొన్నారు. సాంకేతిక ఆవిష్కరణలను కథన కళారీతులతో మేళవిస్తూ.. దక్షిణాసియాలో అత్యంత ముఖ్యమైన కేంద్రంగా ఐలైన్ స్టూడియోస్ సేవలందిస్తుందనీ, అలాగే దృశ్య శ్రవణ, వినోద రంగాల్లో సరికొత్త అవకాశాలను అందిస్తుందనీ శ్రీ సంజయ్ జాజూ చెప్పారు. గతేడాది ముంబయిలో నిర్వహించిన ప్రపంచ దృశ్య, శ్రవణ వినోద సదస్సును ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. సృజనాత్మక, సాంస్కృతిక రంగాలపై ప్రధానంగా దృష్టి సారించే 'ఆరెంజ్ ఎకానమీ' ఆవశ్యకతను ప్రధానమంత్రి ప్రత్యేకంగా వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా పాఠశాలల్లో 15 వేలు, కళాశాలల్లో 500 'కంటెంట్ క్రియేటర్ ల్యాబు'ల ఏర్పాటును కేంద్ర బడ్జెటులో ప్రకటించినట్టు శ్రీ సంజయ్ జాజు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సృజనాత్మక రంగంలో దాదాపు 20 లక్షల ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ) రంగాలకు పెట్టిందిపేరుగా ఉన్న హైదరాబాద్.. ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని శ్రీ జాజూ ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే బాహుబలి వంటి అంతర్జాతీయ స్థాయి చిత్రాలు ఇక్కడ రూపుదిద్దుకున్నాయనీ, అలాగే ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో నిమగ్నమై ఉన్న పలు అంతర్జాతీయ స్టూడియోలూ నగరంలో ఉన్నాయనీ గుర్తుచేశారు. భారత సృజనాత్మక సాంకేతికతల సంస్థ (ఐఐసీటీ) త్వరలోనే హైదరాబాదులో ప్రాంతీయ ప్రాంగణాన్ని కూడా ప్రారంభించనున్నట్టు ఆయన ప్రకటించారు. సృజనరంగ సాంకేతికతలకూ, కంటెంటు సృజనకూ అనువైన వాతావరణాన్ని ఇది మరింతగా కల్పిస్తుందని అన్నారు. హైదరాబాదులోని ఉత్తేజకరమైన తెలుగు చలనచిత్ర పరిశ్రమ అనేక పాన్ ఇండియా, బహుభాషా చిత్రాలను నిర్మిస్తోందని శ్రీ జాజూ అన్నారు. నెట్‌ఫ్లిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలూ, ఐలైన్ వంటి కార్యక్రమాలూ ఈ పరిశ్రమకు మరింత లబ్ధిని చేకూరుస్తాయన్నారు. దీనివల్ల ఉన్నత ప్రమాణాలతో కూడిన కంటెంట్ సృజనకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.




## బండారు వారి వివాహ మహోత్సవం



ఎరుపాలెం మార్చి 12నిర్భయవార్త ప్రతినిధి :మున్నూరు కాపు నియోజవర్గ అధ్యక్షుడు ఆళ్ళ కృష్ణ ఆధ్వర్యంలోఎర్రుపాలెం మండలం రాజులదేవుడుపాలెం గ్రామానికి చెందిన మధిర మార్కెట్ యార్డ్ చైర్మన్ బండారు నరసింహారావు సహోదరుడు బండారు రామారావు కుమార్తె అనూష వరుడు నితిన్ కుమార్ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మధిర నియోజకవర్గ మున్నూరు కాపు నియోజకవర్గ అధ్యక్షులు ఆళ్ళ కృష్ణ, పట్టణ అధ్యక్షులు నీలం వెంకటేశ్వర్లు, మండల సెక్రెటరీ పసుపులేటినాగేంద్ర శ్రీనివాసరావు ,మధిర టౌన్ సెక్రెటరీ దేవి శెట్టి కృష్ణ, ఇల్లూరి నవీన్, ఫిదా కృష్ణ మరియు తదితర నాయకులు పాల్గొన్నారు

## మాపల్లె పెడుతోంది.అభివృద్ధి పరుగులు

మధిర రూరల్ మార్చి 12 నిర్భయవార్త ప్రతినిధి : మండలం పరిధిలోమాటూరుపేట గ్రామ ప్రజలకు తెలియజేస్తున్న సర్పంచ్ చిలువేరు





పూర్ణమ్మబుచ్చిరామయ్యలి నాటూరుపేట పల్లె ఏదిక్కున చూసిన అభివృద్ధితో, పరిశుభ్రమైన పారిశుద్ధ్యంతో గ్రామ నలుమూలలా పరవళ్ళు తొక్కుతోందిదానికి తోడు కలిసొచ్చిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంమనము ప్రతిరోజు ఉపయోగించే వివిధ రకాల ఆహార పదార్థాలకు సంబంధించిన మిగిలిపోయిన చెత్తను, కూరగాయ వ్యర్థాలను నిర్మూలించుకోవడం, గ్రామంలోని రోడ్లకు ఇరువైపులా మురుగునీటి కాలువలో పారే నీటిని శుభ్రం చేసుకోవడం, బహిరంగంగా మల విసర్జన నివారించడం వలన అంటు వ్యాధులు మన దరి చేరవు. ముఖ్యంగా పిల్లల, వృద్ధుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతుంది... మన గ్రామంలో గత వారం రోజులుగా గ్రామ సర్పంచ్ చిలువేరు పూర్ణమ్మ చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు వలన గ్రామంలో ఎటు చూసినా పరిశుభ్రంగా మెరుస్తూ,రోడ్లకు ఇరువైపులా చూడ చక్కని పచ్చని చెట్లతో కలకలాడుతూ చుట్టూ పక్కల గ్రామాల నుండి మాటూరుపేట గ్రామం మీదగా ప్రయాణిస్తున్న వాహనదారులను, పాదాచారులు కట్టిపడేస్తు,పల్లె వాతావరణన్ని, ఆహ్లాదాన్ని,ఆనందాన్ని అందిస్తుందిగ్రామంలోని ప్రతి ఒక్క కుటుంబం మీమీ ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాలు శుభ్రం చేసుకోవడం, చెత్తను ప్రతి బుధవారం మన పంచాయతీ ట్రాక్టర్లు వస్తుంది కాబట్టి దానిలో బాధ్యతగా పడవేయడం, గ్రామంలో కుళాయిల ద్వారా వచ్చే పరిశుభ్రమైన మంచినీటిని త్రాగడం,మరి ముఖ్యంగా వ్యక్తిగత శుభ్రతను పాటించడం వలన పూర్తిగా పరిశుభ్రత గల గ్రామపంచాయతీగా తీర్చిదిద్దటంలో నాతో పాటు మీపాత్ర కూడా చాలా గొప్పగా ఉండాలని మన ఇంటి లెక్కనే మన గ్రామం కూడా పరిశుభ్రంగా ఉంచుతారని కోరుకుంటూ మీ సర్పంచ్ చిలువేరు పూర్ణమ్మ.

## ప్రజా సేవలో భాగస్వామ్యం.. భగవంతుడిచ్చిన వరం!

## ప్రజల దీవెనలతోనే ఈ స్థాయికి చేరుకున్నాం

**నిధుల వినియోగంలో నూతన ప్రజా ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలి శిక్షణ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

మధిర మార్చి 12నిర్భయవార్త ప్రతినిధి :ఖమ్మం రాజకీయాల్లోకి మనం వచ్చింది కేవలం ప్రజా సేవ కోసమే. ఐదేళ్ల తర్వాత మనం పదవి నుంచి దిగిపోయేటప్పుడు.. మన గ్రామం, మన వార్డు ఎంతో అభివృద్ధి చెందిందని ప్రజలు మనల్ని మనస్ఫూర్తిగా అభినందించాలి. ఆ ఆత్మీయతే మనం సంపాదించుకునే అసలైన ఆస్తి" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అభివృద్ధికి బాటలు వేద్దాంలిగ్రామ పంచాయతీల బలోపేతం కోసం ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. "గడిచిన కొద్ది రోజుల్లోనే పంచాయతీల ఖాతాల్లోకి గణనీయంగా




నిధులు జమ అయ్యాయి. మార్చి ఆఖరు నాటికి మరిన్ని నిధులు రాబోతున్నాయి. ఈ నిధులను ఒక ప్రణాళికాబద్ధంగా, ప్రజలకు ఉపయోగపడే పనుల కోసం వినియోగించాలి. మన సొంత డబ్బును ఎంత జాగ్రత్తగా వాడుకుంటామో.. ప్రజా ధనాన్ని కూడా అంతే బాధ్యతగా కాపాడుతూ అభివృద్ధి పనులు చేపట్టాలి" అని సర్పంచులకు సూచించారు. లి?సమన్వయంతో సమస్యల పరిష్కారం అభివృద్ధి పనుల నిర్వహణలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి కోరారు. ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనలో చిన్నపాటి సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. లి?అందరి లక్ష్యం ప్రజా శ్రేయస్సే ఎన్నికల వరకే రాజకీయాలు.. గెలిచిన తర్వాత మనమంతా ప్రజల సేవకులం. పార్టీలకతీతంగా ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలి" అని మంత్రి పిలుపునిచ్చారు. ముఖ్యంగా కొత్తగా ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధులకు అధికారులు పూర్తి స్థాయిలో మార్గనిర్దేశం చేస్తూ, వారిని ప్రోత్సహించాలని ఈ వేదిక ద్వారా కోరారు. ప్రభుత్వం చేపట్టిన ఈ 99 రోజుల ప్రణాళికలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.

## 14 నుండి జరిగే పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

## ఎర్రుపాలెం మండలంలో సర్వం సిద్ధం ఎంఈఓ బి మురళీ మోహన్ రావు

ఎరుపాలెం మార్చి 12 నిర్భయవార్త ప్రతినిధి : తెలంగాణలో ఈనెల 14వ తేదీ నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి ఎస్ఎస్సి వార్షిక పరీక్షల నిర్వహణకు ఎర్రుపాలెం మండలం పరిధిలోని అన్ని పరీక్షా కేంద్రాలకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి బి మురళీ మోహన్ రావు తెలిపారు. 9 ప్రభుత్వ



పాఠశాలలు ఒకటి గురుకుల ఒకటి కేజీబీవీ మరియు ఆరు ప్రైవేటు పాఠశాలల నుండి మొత్తం 421 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు మొత్తం విద్యార్థులలో 162 మంది బాలురు 259 మంది బాలికలు ఉన్నారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల నుండి బాలురు 104, బాలికలు 198 మొత్తం 302, ప్రైవేటు పాఠశాల నుండి బాలురు 58, బాలికలు 51 మొత్తం 119 మొత్తం 119 మంది,అత్యధికంగా గురుకులాలో నుండి 79 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. కేంద్రాల వారీగా నియామకాలు:-పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేందుకు మూడు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. 42 మంది ఇన్విజిలేటర్ ను కేటాయించాము అని ఎంఈఓ గారు వివరించారు. 1. సెంటర్ నెంబర్ 31063 గురుకుల ఎర్రుపాలెం నందు 138 మంది విద్యార్థులలో తెలుగు మీడియం 6 గురు ఇంగ్లీష్ మీడియం 132 మంది, బాలికలు 74,బాలురు 64 కేటాయించడం అయినది లిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎర్రుపాలెం సెంటర్‌లి నెంబర్ 31062 నందు 16 మంది ఇన్విజిలేటర్లు,162 మంది విద్యార్థులు దీంట్లో బాలురు 40 మంది,బాలికలు 122 మంది, తెలుగు మీడియం ఒకరు,ఇంగ్లీష్ మీడియం 16 మంది కేటాయించడం జరిగింది. శీలం రామ్మోహన్ రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ పాఠశాల బనగండ్లపాడు ఎంటర్ నెంబర్ 31064 నందు12 మంది ఇన్విజిలేటర్ లను, 121 మంది విద్యార్థులను కేటాయించడమైనది వీరిలో 58 మంది బాలురు,63 మంది బాలికలు. ఇంగ్లీష్ మీడియం 63 మంది తెలుగు మీడియం ఒకరుకేటాయించడమైనది. వైద్య సిబ్బందిని కూడా పరీక్షా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాము. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయడమైనది మరియు పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఎటువంటి జిరాక్స్ సెంటర్లు లేకుండా చేయడమైనది. పోలీస్ సిబ్బందిని కూడా పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేయడమైనది మరియు పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయినట్లు ఏర్పాట్లు చేశారు కావున తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని ఎంఈఓ గారు తెలియజేశారు. పరీక్షా కేంద్రాల లోపలకి ఎవరిని గుర్తింపు కార్డు లేకుండా ప్రవేశించడానికి అనుమతి ఇవ్వరు గమనించగలరు.

## శరణ్య కు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు


మధిర రూరల్ మార్చి 12 నిర్భయవార్త ప్రతినిధి :మున్సిపాలిటీ



పరిధిలోపుల్లఖండం వారి వీధి వాస్తవ్యులు ఉపాధ్యాయులు స్వర్గం శ్రీనివాసరావు రాణి కుమార్తె బీటెక్ విద్యార్థిని కుమారి స్వర్గం శరణ్య నిన్న రోడ్ ప్రమాదంలో మృతి చెందారు గురువారం నాడు పలువురు ప్రముఖులు యోగ గురుజి సభ్యులు మృతురాలి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన పలువురు ప్రముఖులు రాజకీయ నాయకులు పలువురు యూనియన్ సంఘ ఉపాధ్యాయులు టీచర్స్ డాక్టర్స్ వార్డ్ కౌన్సిలర్లు ప్రజలు యోగ సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు

## సాయిబాబా దేవాలయంలో అన్నదానం

మధిర మార్చి 12 నిర్భయవార్త ప్రతినిధి :స్థానిక శ్రీ దివ్య షిరిడి సాయిబాబా మందిరములో ప్రతిగురువారం సాయి ప్రసాదం అన్నప్రసాదం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదానం కార్యక్రమాన్ని దాతలు ప్రారంభించారు. తొలిత ఆలయంలో సాయిబాబాకు పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ, ప్రసాదములు అందజేశారు. దాతలకు కమిటీ సభ్యులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో దేవాలయం నిర్వాహకులు, కోశాధికారి కురువెళ్ళ వెంకట పురుషోత్తం (కృష్ణ), చల్లగుండ్ల సత్యవతి, సురేషు, శ్రీను, చలువాది చిన్న కృష్ణమూర్తి,





కొల్లా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ఆచార్యులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించాలను కొనేవారు కురువెళ్ల వెంకట పురుషోత్తం (కృష్ణ), 9848368687 సెల్ నెంబర్ నందు సంప్రదించాలని వారి సందర్భంగా కోరారు.

## తెలంగాణలో హాఫ్‌డే స్కూల్స్.. మార్చి 15 నుంచి ప్రారంభం

హైదరాబాద్:మార్చి 12నిర్భయవార్త ప్రతినిధి : తెలంగాణలో పాఠశాలల పనివేళల్లో మార్పులు చేస్తూ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో హాఫ్‌డే స్కూల్స్ అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈ. నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం మార్చి 15 నుంచి ఏప్రిల్ 23, 2026 వరకూ అన్ని పాఠశాలలు హాఫ్‌డే విధానంలో నడుస్తాయి. విద్యాశాఖ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే నిర్వహించనున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం (మిడ్‌డే మీల్స్) మధ్యాహ్నం 12.30 గంటలకు అందజేస్తారు. ఇక పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి. తద్వారా మార్చి 2026లో జరిగే పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు.

## స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో సర్పంచులకు శిక్షణ ప్రారంభం

యాదాద్రి భువనగిరి జిల్లా, మార్చి 11 నిర్భయవార్త ప్రతినిధి :తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఎన్నికైన పంచాయతీ సర్పంచులు మరియు వార్డు సభ్యులకు ప్రభుత్వ పథకాలు, పరిపాలనా విధులు, ప్రజా సంబంధాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ




కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గ్రామ పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసి గ్రామాల సమగ్ర అభివృద్ధిని సాధించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అధికారులు తెలిపారు. జిల్లాకు చెందిన సర్పంచుల కోసం పోచంపల్లిలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో శిక్షణ కార్యక్రమం జరుగుతోంది. ఇప్పటికే పలు బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వగా, ప్రస్తుతం మరికొన్ని మండలాల సర్పంచులకు శిక్షణ అందిస్తున్నారు. ఈ క్రమంలో మార్చి 11 నుంచి మోటకొండూరు మండలానికి చెందిన సర్పంచులకు శిక్షణ ప్రారంభమైంది. మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. శిక్షణలో గ్రామ అభివృద్ధి ప్రణాళికలు, ప్రభుత్వ నిధుల సమర్థ వినియోగం, సంక్షేమ పథకాల అమలు, గ్రామ సభల నిర్వహణ, ప్రజలతో సమన్వయం వంటి అంశాలపై నిపుణులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాటూరు గ్రామ సర్పంచ్ జన్నె సిద్ధులు సహా ఇతర గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సర్పంచులకు అవసరమైన మార్గదర్శకాలు అందించారు. ఈ శిక్షణతో గ్రామ పంచాయతీ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారితనం పెరిగి గ్రామాల అభివృద్ధి వేగవంతం అవుతుందని అధికారులు తెలిపారు. మోటకొండూరు మండలంలోని సర్పంచులు కూడా ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఇతర మండలాలకు చెందిన సర్పంచులు కూడా సుమారు 50 మంది చొప్పున బ్యాచ్‌లుగా ఈ శిక్షణ పొందుతున్నారు.

## ప్రెస్ క్లబ్ లో జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయండి.

హైదరాబాద్ నిర్భయవార్త ప్రతినిధి : తెలంగాణ ఉద్యమ కారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రత్యేక్ష్య కార్యాచరణ ప్రకటించి, అమలు చేయాలని ఈ నెల 14 న , శనివారం నాడు హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ సమైక్య ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలంగాణ ఉద్యమ కారులను, ఉద్యమ సంఘాలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రజల వీరోచిత పోరాటం, అమరుల త్యాగ ఫలితం గా ఏర్పడిన తెలంగాణాలో నేటికి ఉద్యమ కారులకు సరైన గౌరవం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమ కారులకు ఇచ్చిన హామీల అమలుపై కోడా నేటికి సరైన ప్రణాళిక లేదని అన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో హామీల అమలుకై కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని, లేని పక్షంలో "తెలంగాణ సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ కరుణాకర్ దేశాయ్" ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు కార్యాచరణ సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.. తెలంగాణ సమాఖ్య లో విద్యావంతులు, న్యాయ నిపుణులు, సీనియర్ జర్నలిస్టులు, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాలు భాగస్వామ్యంగా, ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, ఉద్యమ కారుల సంక్షేమంపై చర్చించనున్నట్లు తెలిపారు. కనుక ఈ సమావేశంలో ఉద్యమ కారులు, విద్యావేత్తలు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు..



## ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు

**షాద్ నగర్ స్థానిక ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులు**

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు శిక్షణ**

**శిక్షణ తరగతులకు హాజరైన చైర్మన్ బసవేశ్వర్, చైర్మన్ అందేమోహన్ తదితరులు**

షాద్ నగర్ నిర్భయవార్త ప్రతినిధి : ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా సర్పంచులు, మున్సిపల్ చైర్మన్, చైర్‌పర్సన్, వార్డు సభ్యులకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ పలకవర్గానికి ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందేమోహన్ తదితర కౌన్సిలర్లు ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు వచ్చి ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవు తాయని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదేపదే ఉటంకిస్తున్న విషయాన్ని వారు గుర్తు చేశారు. ప్రజలకు ఏ విధంగానైతే ప్రామాణికమైన ఫలితాలు అందుతాయో, ఆ కోణంలో ఈ శిక్షణా కార్యక్రమం ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగేలా ఉండాలన్నారు. ప్రత్యేక శిక్షణ తరగతులపై పాలకవర్గం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు విశాల, జమాల్పూర్ సంతోషి బాయ్, నడికుడ శ్రావణి, ఎస్పీ శివ, సింగపగ శిరీష, ఒగ్గు జయలక్ష్మి, ఆరిఫా బేగం, గౌస్ జానీ, పెంటయ్య, రాజు నాయక్, పినమోని గోపాల్, పిల్లి శారద, సుధీర్, బచ్చలి నరేష్, మురళీమోహన్ అప్పి, ప్యాట అశోక్, కళ్యాణ్ కార్ దిలీప్, కొప్పునూరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు..




## కలెక్టర్ గారూ.. ఉప సర్పంచుల "చెక్ పవర్" కు చెక్ పెట్టండి..

షాద్ నగర్ నిర్భయవార్త ప్రతినిధి :షాద్నగర్ అభివృద్ధి పనులకు అడ్డం పడుతూ.. రాజకీయ వైషమ్యాలను సృష్టిస్తూ.. గ్రామాల అభివృద్ధి జరగకుండా ఇబ్బందులు పెడుతున్న "ఉప సర్పంచ్" ల చెక్ పవర్ ను రద్దు చేయాలని కొత్తూరు మండలం సర్పంచుల సంఘం అధ్యక్షుడు "ఎర్రోళ్ల జగన్" డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కు ఆయన ఫిర్యాదు చేశారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన చెక్కులకు సంబంధించి సర్పంచ్, ఉప సర్పంచ్ ల సంతకాలు అవసరం ఉండగా, పార్టీలపరమైన వివాదాలతో ఉపసర్పంచులు సంతకాలు చేయకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆయన ఫిర్యాదులో తెలియజేశారు. వీరి చర్యల వల్ల గ్రామీణ ప్రాంతాలలో వీధి దీపాల ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం, కాలువల నిర్మాణం, పారిశుద్ధ్య కార్యక్రమాలు, తాగునీరు వంటి పనులు ముందుకు సాగక గ్రామ ప్రజలతో తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని, పాలనపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. పార్టీపరమైన విభాగాలతో ఉపసర్పంచులు రాజకీయాలు చేస్తూ పాలనను ముందుకు సాగనివ్వకపోవడంతో పాలనా వ్యవస్థ స్తంభించిపోతుందని అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపసర్పగంచ్లు బ్లాక్మెయిల్ సంస్కృతిని ప్రోత్సహిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. అందుకే పాలన సౌలభ్యత కోసం ఉపసర్పంచ్ ల చెక్ పవర్ ను రద్దు చేయాలని కోరారు. ప్రత్యామ్నాయంగా గ్రామ కార్యదర్శి, లేదా మండల అభివృద్ధి అధికారికి బాధ్యతను అప్పగించాలని సూచించారు. ఈ సమస్యపై ప్రభుత్వానికి ప్రత్యేక నివేదిక పంపి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఇది గ్రామాల అభివృద్ధికి దోహదం చేస్తుందని, అభివృద్ధిలో రాజకీయాలను దూరం చేస్తుందని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. వార్డు సభ్యుల సంతకాలతో కూడిన ప్రతిని జిల్లా కలెక్టర్ కు ఆయన పంపించారు.



## అగ్రిగోల్డ్ వెంచర్ లో మట్టి త్రవ్వకాలు..

షాద్ నగర్ నిర్భయవార్త ప్రతినిధి : షాద్నగర్ వివాదాస్పదంగా మూతపడిన ఓ వెంచర్లో అడిగేవారు ఉండరని కొందరు ఘనులు అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతూ పబ్బం గడుపుకుంటున్నారు. దాదాపు వెంచర్ లో ఉన్న ప్లాట్లను ధ్వంసం చేసి దాదాపు పది ఎకరాల వరకు పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు కొంతకాలంగా జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం తెలియడంతో ఎస్ఓటి పోలీసులు ఆకస్మిక దాడులు జరిపి నిందితులను పట్టుకున్నారు. అర్ధరాత్రి తర్వాత రహస్యంగా ఫరుక్ నగర్ మండలం విఠ్యాల గ్రామపంచాయతీ పరిధిలోని శ్యామలబండ తండా సమీపంలో ఉన్న అగ్రిగోల్డ్ వెంచర్ లో గత కొంతకాలంగా అక్రమ మట్టి తరలింపు కార్యక్రమం రహస్యంగా కొనసాగుతోంది. అయితే బాధ్యత గల పదవిలో ఉన్న విఠ్యాల గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు జటావత్ శంకర్, అదేవిధంగా జరుపుల వెంకట నాయక్ ఇద్దరు కలిసి ఈ మట్టి వ్యాపారం రహస్యంగా నిర్వహిస్తున్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అగ్రిగోల్డ్ వెంచర్ వివాదాస్పదంగా ఉండడంతో ఇందులో ఉన్న ఇళ్ల స్థలాలు తదితర అంశాలపై కోర్టులో కేసులు గొడవలు నడుస్తున్న నేపథ్యంలో ఎవరు పట్టించుకోవడం లేదు. ఇదే అదునుగా భావించిన సదరు నాయకులు ఇందులో మట్టి తవ్వకాలు జరిపితే ఎవరికి తెలియదన్న ధైర్యంతో రాత్రింబవళ్లు కొంతకాలంగా మట్టి వ్యాపారాన్ని ప్రభుత్వం కంట పడకుండా తరలిస్తున్నారు. విషయం బయటికి పొక్కడంతో సమాచారం సేకరించిన ఎస్వోటీ పోలీసులు రాత్రి అక్రమ మట్టి తవ్వుతున్న విషయం తెలుసుకొని వెంటనే మూడు టిప్పర్ లారీలు ఒక జెసిబి వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ సమాచారాన్ని పట్టణ సీఐ కె సీతారాంను మీడియా కోరగా మూడు వాహనాలు ఒక జెసిబి వాహనం సీజ్ చేసిన మాట వాస్తవమేనని ధ్రువీకరించారు. వీటిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. బాధ్యత గల వార్డు సభ్యుడు హోదాలో ఉండి మట్టి తవ్వకాలు చేస్తున్న జటావత్ శంకర్ మరో వ్యక్తి జరుపుల వెంకట నాయక్ పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు..



## ప్రజల సమస్యలపై రాష్ట్ర అధ్యక్షుడికి నివేదిక అందించిన బీజేపీ న్‌ఛార్జ్ అందే బాబాయ్య

షాద్ నగర్ నిర్భయవార్త ప్రతినిధి : షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావును కలిసి వివరణాత్మక నివేదికను సమర్పించారు రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు,సీనియర్ నాయకులు అందే బాబయ్య ముదిరాజ్. వినతిపత్రంలో పలు అంశాలపై మాట్లాడుతూ,,,ముఖ్యంగా కేశంపేట్ రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ఇప్పటివరకు ప్రారంభం కాకపోవడం,చటాన్‌పల్లి రైల్వే గేట్ వద్ద ప్రారంభమైన ఫ్లైఓవర్ నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడం వల్ల షాద్నగర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అదనంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల దుస్థితి,సరైన స్ట్రీట్ లైట్లు లేకపోవడం వంటి మౌలిక వసతుల సమస్యలను కూడా వివరించారు. ఈ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు విజ్ఞప్తి చేశారు. షాద్నగర్ ప్రజాల అభివృద్ధి,సంక్షేమం కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు వారికి తెలిపారు.



## పెళ్లికి పుస్తే మట్టెలు అందజేసిన ప్రేమ హస్తం ఫౌండర్ రెవరెండ్ డాక్టర్ విజయ్ దార్ల

ఇబ్రహీంపట్నంనిర్భయవార్త ప్రతినిధి : రంగారెడ్డి జిల్లాకు చెందిన తల్లి తండ్రి లేని పేద ఆడబిడ్డ మమత వివాహానికి పుస్తే మట్టెలు అందజేసిన ప్రేమ హస్తం ఫౌండర్ రెవరెండ్ డాక్టర్ విజయ్ దార్ల ఎలిజబెత్ దార్ల మమత వారి అక్క బావ అమ్మాయి వివాహము జరిపిస్తున్నారు. వారు ట్రస్ట్ నుండి సహాయం కోరారు కాబట్టి ట్రస్టు ద్వారా ఈ సహాయము ఇవ్వడం జరిగింది సహాయం అందించిన దేవాది దేవునికి వందనాలు ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రెవరెండ్ డాక్టర్ విజయ్ దార్ల ఎలిజబెత్ దార్ల సభ్యులు పి రోజీ పి. శ్యాంసుందర్ ఓ జే మోజెస్ శకుంతలమ్మ తదితరులు పాల్గొన్నారు.



## జహంగీర్ పీర్ దర్గా అభివృద్ధికి నిధులు మంజూరి చేయండి

షాద్ నగర్ నిర్భయవార్త ప్రతినిధి : రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని ప్రఖ్యాత జహంగీర్ పీర్ దర్గా అభివృద్ధికి మరిన్ని నిధులు అదనంగా మంజూరు చేయాలని మైనారిటీ సంక్షేమం, ప్రజా సంస్థల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ కోరారు. గురువారం రాజధాని లో మంత్రి అజారుద్దీన్ ని తన కార్యాలయంలో ప్రత్యేకంగా కలుసుకుని జహంగీర్ దర్గా అభివృద్ధి గురించి మాట్లాడారు. దాదాపు 12 కోట్ల హెచ్.ఎం.డి.ఏ నిధులతో దర్గా అభివృద్ధి పనులు జరుగుతున్నాయనీ మరో 8 కోట్ల రూపాయలు నిధులు అదనంగా మంజూరు చేయగలరని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా దర్గా అభివృద్ధికి తమ వంతు సహకారం పెద్ద ఎత్తున అందించాలని ఎమ్మెల్యే మంత్రికి విన్నవించారు. దీనిపై స్పందించిన మంత్రి అజారుద్దీన్ ఇటీవల దర్గాను సందర్శించడం జరిగిందని దర్గా అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక చర్యలు చేపట్టి అభివృద్ధి చేసేందుకు ముందుకు వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు.



## అక్క మృతితో దుఃఖంలోనూ పరీక్ష రాసిన చెల్లెలు

మధిర 12 నిర్భయవార్త ప్రతినిధి :అక్క మరణంతో తీవ్ర దుఃఖంలో మునిగిపోయినా, తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు హాజరైన ఓ విద్యార్థిని మనసును కదిలించే ఘటన మధిరలో చోటుచేసుకుంది. మధిర ప్రాంతానికి చెందిన చంద్ర హాసిని అనే విద్యార్థిని ఖమ్మం లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాస్తోంది. అయితే బుధవారం మధిర సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె అక్క శరణ్య దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయింది. అక్క ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అయినప్పటికీ తన విద్యను ఆపకూడదనే సంకల్పంతో, కన్నీళ్లు ఆపుకుంటూ చంద్ర హాసిని పరీక్షా కేంద్రానికి వెళ్లి ఇంటర్ ఫస్ట్ ఇయర్ కెమిస్ట్రీ పరీక్షను రాసింది. తీవ్ర మనోవేదన మధ్య కూడా ధైర్యంగా పరీక్ష రాసిన హాసిని పరిస్థితి అక్కడున్న వారందరినీ కదిలించింది. ఆమె పట్టుదల, ధైర్యాన్ని పలువురు అభినందించారు. అక్కను కోల్పోయిన దుఃఖంలోనూ భవిష్యత్తు కోసం పరీక్ష రాసిన ఈ విద్యార్థిని ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.








ఆందోళనలో ఎల్‌పీజీ వినియోగదారులు

భయాందోళనకు గురికావొద్దన్న జాయింట్ సెక్రటరీ

బుక్ చేసిన రెండు రోజుల్లోనే ఎల్‌పీజీ సరఫరా

బ్లాక్ మార్కెటింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు

రాష్ట్రాలకు సూచించిన కేంద్ర ప్రభుత్వం

తీవ్రమైన ఎల్‌పీజీ కొరత

# గ్యాస్.. సంక్షోభం!

- ఎనిమిది రాష్ట్రాల్లో హోటళ్లపై తీవ్ర ప్రభావం
- దేశవ్యాప్తంగా మూతపడుతున్న హోటళ్లు
- ఏజెన్సీల వెలుపల ఖాళీ సిలిండర్లతో క్యూ
- వంట గ్యాస్‌కు మొదలైన ఇబ్బందులు
- భారత్‌లో ఏటా 3.1 టన్నుల ఎల్‌పీజీ వినియోగం



ఎక్కడో 3 వేల కిలోమీటర్ల దూరంలో జరుగుతున్న యుద్ధానికి సంబంధించిన ప్రకంపనలు భారత్‌లోని వంటిళ్లు, వాణిజ్య ఎల్పీజీపై పూర్తిగా ఆధారపడే హోటళ్లు, రెస్టారెంట్లను తాకుతున్నాయి. ఇరాన్ ఘర్షణల ప్రభావం, హర్మూజ్ జలసంధి మూసివేత ప్రభావం వంట గ్యాస్ కొరతకు దారితీసింది. కొన్ని రోజులుగా ఎల్పీజీ ఏజెన్సీల వెలుపల ఖాళీ సిలిండర్లతో వినియోగదారులు బారులు తీరి నిలబడిన దృశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిస్తున్నాయి. అయితే.. వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల కొరత వేగంగా దేశంలోని అనేక నగరాలకు విస్తరిస్తున్నది. బెంగళూరు, చెన్నై, ముంబై, కోల్‌కతా, లక్నో తదితర నగరాల్లో వాణిజ్య ఎల్పీజీ కొరత కారణంగా హోటళ్లు, రెస్టారెంట్లు పెద్ద సంఖ్యలో మూతపడుతున్న తీరు కనిపిస్తోంది. ఈ సంక్షోభానికి ప్రధాన కారణం భారత్ తన గృహోపయోగ ఎల్పీజీ అవసరంలో 60 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతున్నది. ఇందులో దాదాపు 8590 శాతం హర్మూజ్ జలసంధి మీదుగానే సరఫరా జరగవలసి ఉంటుంది. హర్మూజ్‌ను ఇరాన్ మూసివేయడంతో దాని ప్రభావం భారత్ ఎల్పీజీ దిగుమతులపై పడుతున్నది. భారత్ ఏటా దాదాపు 3.1 కోట్ల టన్నుల ఎల్పీజీని వినియోగిస్తున్నది. ఇందులో 87 శాతం గృహ అవసరాల కోసం ఉపయోగిస్తుండగా మిగిలిన వాటా హోటళ్లు, రెస్టారెంట్లకు వెళుతుంది.




## 8 రాష్ట్రాల్లో హోటళ్లపై తీవ్ర ప్రభావం..

పశ్చిమాసియా ఘర్షణలు రెండో వారంలోకి ప్రవేశించిన నేపథ్యంలో వాణిజ్య సిలిండర్ల సరఫరాలో అంతరాయం ఆతిథ్య రంగంపై ప్రభావం చూపడం మొదలైంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ సహా అనేక రాష్ట్రాల్లో వాణిజ్య ఎల్పీజీ సరఫరాపై తాత్కాలిక నిషేధం అమల్లోకి వచ్చింది. ఈ నిషేధంతో అనేక నగరాల్లోని రెస్టారెంట్లు, హోటళ్లు మూతపడగా సరఫరాను పునరుద్ధరించాలని హోటల్ యజమానులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. సరఫరా సంక్షోభం కొనసాగితే తినే మసాలా దోస నుంచి మిరపకాయ బజ్జీ దాకా ఆహార పదార్థాలన్నీ ఖరీదైనవిగా మారిపోయే అవకాశం ఉంది. ఇప్పటికీ చాలా రెస్టారెంట్లలో పీఎన్‌జీ కనెక్షన్లు లేదా విద్యుత్తు వంట వ్యవస్థలు వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేవు.

## ముంబైలో 20 శాతం హోటళ్లు మూత..

ముంబైలో పరిస్థితి తీవ్రరూపం దాలుస్తున్నది. నగరంలో ఇప్పటికే 20శాతం హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడినట్లు ముంబై హోటల్స్ అసోసియేషన్ ఆహార్ ప్రకటించింది. వాణిజ్య సిలిండర్ల సరఫరాలు మెరుగుపడకపోతే వచ్చే రెండు రోజుల్లో 50 శాతం వరకు హోటళ్లు మూతపడవచ్చని ఆహార్ హెచ్చరించింది. దాదర్, అంధేరీ ప్రాంతాల్లోని హోటళ్లు తమ మెనూను తగ్గించాయి. కొన్ని హోటళ్లలో అయితే కొన్ని గంటలు మాత్రమే నడుపుతూ ఎల్పీజీని పొదుపుచేస్తున్నాయి. రెస్టారెంట్లు ఎల్పీజీ కొరతను ఎదుర్కోవడానికి ప్రధాన కారణం ప్రభుత్వం గృహ వినియోగదారులకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంగా తెలుస్తున్నది. ఆదివారం నుంచి వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల సరఫరా నిలిచిపోయినట్లు రెస్టారెంట్ యజమానులు వెల్లడించారు.

## బెంగళూరు హోటళ్ల మూసివేత..


కర్నాటకలోని ఐటీ హబ్ బెంగళూరులో పరిస్థితి భిన్నంగా ఏమీ లేదు. వాణిజ్య ఎల్పీజీ అందుబాటులో లేకపోవడంతో చాలా హోటళ్లు వంట కోసం సంప్రదాయ కట్టెల పొయ్యిని ఆశ్రయిస్తుండడం విశేషం. మంగళవారం నుంచి నగరవ్యాప్తంగా హోటళ్లపై ఎల్పీజీ కొరత ప్రభావం కనిపించనున్నట్లు బెంగళూరు హోటల్స్ అసోసియేషన్ తెలిపింది. ఎల్పీజీ సరఫరాపై 70 రోజుల వరకు ఎటువంటి ప్రభావం ఉండబోదని చమురు కంపెనీలు గతంలో హామీ ఇచ్చినప్పటికీ హఠాత్తుగా ఎల్పీజీ సరఫరాను నిలిపివేయడం హోటళ్లకు చావుదెబ్బేనని అసోసియేషన్ తెలిపింది. బెంగళూరులో పేరుమోసిన టిఫిన్ సెంటర్ విద్యార్థి భవన్ మూతపడే అవకాశాలు కనపడుతున్నాయి.

## కోల్‌కతాలో సంక్షోభం..

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఎల్పీజీ నిల్వలు పూర్తిగా అడుగంటడంతో అనేక రెస్టారెంట్లు, బేకరీలు మూతపడుతున్నాయి. సోమవారం వరకు వాణిజ్య ఎల్పీజీ సరఫరా కొద్ది మేరకు జరిగిందని, మంగళవారం ఉదయం నుంచి పూర్తిగా నిలిచిపోయిందని హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఈస్టర్న్ ఇండియా తెలిపింది. ఎల్పీజీ సిలిండర్ల కొరత లేదని కేంద్రం వాదిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏఐ) ప్రకటించింది.

## చెన్నైలో దుర్భర పరిస్థితి..

తమిళనాడు రాజధాని చెన్నైలో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. స్టాక్ లేకపోవడంతో ఇప్పటికే వాణిజ్య ఎల్పీజీ పంపిణీదారులు సిలిండర్ల సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. ఫలితంగా అనేక హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడ్డాయని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ పురీకి రాసిన లేఖలో చెన్నై హోటల్ అసోసియేషన్ తెలిపింది. చెన్నైలోని ప్రముఖ హోటల్ అన్నపూర్ణ తన మెనూపై కోత విధించడంతోపాటు తన కార్యకలాపాల సమయాన్ని కూడి తగ్గించి వేసింది.




## భయాందోళనలకు గురి కావొద్దన్న కేంద్రం..

గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసిన రెండున్నర రోజుల్లోనే సిలిండర్ డెలివరీ అవుతుందని కేంద్రం పేర్కొంది. ప్రభుత్వ చర్యలతో ఎల్‌పీజీ ఉత్పత్తిని 25శాతానికి పెంచామని ప్రకటించింది. హోర్ముజ్ జలసంధితో సంబంధం లేని రూట్ల ద్వారా చమురు దిగుమతి అవుతోందని వివరించింది. హోర్ముజ్ నుంచి ఆగిపోయిన సప్లై కంటే ఎక్కువ చమురునే సేకరించామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఎల్పీజీ సిలిండర్ల విషయంలో ప్రజలెవరూ భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని కేంద్ర పెట్రోలియంశాఖ పేర్కొంది. రెండున్నర రోజుల సాధారణ డెలివరీ ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు తెలిపింది. కస్టమర్లు సిలిండర్లను హడావిడిగా బుక్ చేయాల్సిన అవసరం లేదు. భయాందోళనలకు గురి కావొద్దు. సాధారణంగానే బుకింగ్స్ అవుతాయని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాతా శర్మ తెలిపారు. గ్యాస్ సిలిండర్ల మార్కెట్ విషయంలో బ్లాక్ మార్కెటింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.




# సినిమా సిత్రం



## నభా నటేష్.. నాగబంధం!

### డ్యాన్స్ ముద్రలో వయ్యారి భామలు





అభిషేక్ నామ దర్శకత్వంలో విరాట్ కర్ణ హీరోగా రూపొందుతున్న మైథాలజీ ఫాంటసీ చిత్రం 'నాగ బంధం'. ఈ సినిమాలోని మొదటి పాట 'నమో రే' ఈ నెల 15వ తేదీన ఉదయం 11:11 గంటలకు విడుదల చేయబోతున్నారు. పురాతన నిధులు, అతీంద్రియ శక్తుల నేపథ్యంతో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. లేటెస్ట్‌గా విడుదల చేసిన పోస్టర్‌లో నభా నటేష్, ఐశ్వర్య మీనన్ క్లాసికల్ డ్యాన్స్ ముద్రల్లో కనిపిస్తున్నారు. ఒక పురాతన ఆలయం ముందు సంప్రదాయబద్ధమైన దుస్తులు, ఆభరణాలతో ఉన్న వీరిద్దరి లుక్స్ చాలా డిగ్నిఫైడ్‌గా ఉన్నాయి. ఈ పాట ఆధ్యాత్మికతో మెలోడీగా ఉండబోతోందని పోస్టర్ ద్వారా అర్థమవుతోంది. జునైద్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. టీజర్ విడుదలైనప్పటి నుండి ఈ సినిమా విజువల్స్ పట్ల సోషల్ మీడియాలో జోరుగా చర్చ జరుగుతోంది. డైలాగులు లేకుండా కేవలం నేపథ్య సంగీతం, గ్రాఫిక్స్‌తోనే ఒక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసిన దర్శకుడు, ఇప్పుడు పాటల ద్వారా సినిమాలోని ఎమోషన్‌ను హైలెట్ చేయాలని చూస్తున్నారు.

## నిక్కీ కబ్జా!

- తంబోలికి అన్నీ మంచిరోజులే
- రియాల్టీ షో నుంచి సినీ రంగంలోకి

ప్రముఖ రియాలిటీ షో ది 50 ద్వారా ప్రస్తుతం వార్తల్లో నిలుస్తున్న నటి నిక్కీ తంబోలి తాజాగా తన ఇన్‌స్టాలో షేర్ చేసిన ఒక సందేశం సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది. తాజా పోస్ట్ లో ఎవరినీ ఉద్దేశించి నేరుగా అనకపోయినా కానీ.. తను రాసిన పదాలు ఎంతో ఘాటుగా ఉన్నాయి. ఈ పోస్ట్ చూసిన అభిమానులు షోలో జరుగుతున్న అంతర్గత విభేదాల వల్లే నిక్కీ ఇలా స్పందించిందని అభిప్రాయ పడుతున్నారు. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే నిక్కీ తంబోలి ఇలాంటి పోస్ట్‌లు పెట్టడం వెనుక ఏదో బలమైన కారణమే ఉంటుందని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఈ నిగూఢమైన సందేశం షో`లో తనపై జరుగుతున్న కుట్రలను ఉద్దేశించినదా లేక మరేదైనా వ్యక్తిగత కారణమా అనేది ప్రస్తుతానికి సస్పెన్స్‌గా మారింది. ఏదేమైనా ఈ ఇన్‌స్టా స్టోరీ ఇప్పుడు ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతోంది. నిక్కీ తంబోలి కెరీర్ అప్‌డేట్స్.. నిక్కీ తంబోలి టాలీవుడ్ లో చీకటి గదిలో చితక్కొట్టుడు అనే చిత్రంలో నటించిన సంగతి తెలిసిందే. నిక్కీ ప్రస్తుతం తన కెరీర్‌లో బిజీగా గడుపుతోంది. సినిమాల విషయానికి వస్తే .. తను నటించిన `కబ్జా 2 స్ట్రీమ్ కి రానుంది. కొన్ని బాలీవుడ్ మ్యూజిక్ వీడియోలు, వెబ్ సిరీస్‌లు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రల కోసం ఆమె ప్రస్తుతం స్క్రిప్టులను ఎంచుకుంటోంది. దక్షిణాది సినిమాల్లో కూడా మళ్లీ మెరవడానికి నిక్కీ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఇక టీవీ కెరీర్ విషయానికి వస్తే.. నిక్కీకి రియాలిటీ షోలే పెద్ద ప్లస్ పాయింట్ అయ్యాయి. బిగ్ బాస్ 14, ఖత్రోన్ కే ఖిలాడీ వంటి షోలతో నిక్కీ ఇంటింటికీ పరిచయమైంది. ప్రస్తుతం ది 50 రియాలిటీ షోలో తనదైన ముద్ర వేస్తూ టెలివిజన్ రంగంలో టాప్ సెలబ్రిటీగా కొనసాగుతోంది. గ్లామర్ షో చేయడమే కాకుండా.. తన బోల్డ్ మాటలతో కౌంటర్లతో టీవీ ఆడియన్స్‌ను అలరిస్తూ సోషల్ మీడియా క్వీన్‌గా పేరు తెచ్చుకుంది.



## హన్సిక.. కటీఫ్!

- విడాకుల బాటలో నటి
- బీటలువారిన వివాహ బంధం

ప్రముఖ నటి హన్సిక మోత్వాని.. వ్యాపారవేత్త సోహెల్ ఖతురియా తమ నాలుగేళ్ల వివాహ జీవితాన్ని పరస్పర అంగీకారంతో ముగించాలని నిర్ణయించుకున్నారు. వివాహం అయిన నాలుగేళ్ల తరువాత ఈ జంట పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకుంటున్నారు. హన్సిక.. సోహెల్ 2022 డిసెంబర్ 4న రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఉన్న ముండోటా ఫోర్ట్ అండ్ ప్యాలెస్‌లో అతి వైభవంగా వివాహం చేసుకున్నారు. ఈ పెళ్లి వేడుకకు కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. మెహంది, సంగీత్, హల్దీ వంటి సంప్రదాయ వేడుకలు కూడా ఎంతో ఘనంగా జరిగాయి. వారి పెళ్లి ఫోటోలు.. వీడియోలు అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి ఈ జంట ప్రేమకథను ఆధారంగా తీసుకుని "హన్సికస్ లవ్ షాది డ్రామా" అనే రియాలిటీ షో కూడా ఓటీటీలో పాపులర్ అయ్యింది. అందులో వారి ప్రేమ, పెళ్లి ఏర్పాట్లు.. కుటుంబ సభ్యులతో ఉన్న బంధం ప్రేక్షకులకు చూపించారు. ఈ షో ప్రేక్షకులలో మంచి ఆదరణ పొందింది. అయితే గత కొంతకాలంగా ఈ జంట మధ్య సమస్యలు.. ఉన్నాయనే వార్తలు వినిపించాయి. ముఖ్యంగా హన్సిక తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుండి పెళ్లి ఫోటోలను తొలగించడం వల్ల విడాకులపై ఊహాగానాలు పెరిగాయి. ముఖ్యంగా హన్సిక ఈ విడాకుల సందర్భంలో ఎలాంటి భరణం తీసుకోకుండా నిర్ణయం తీసుకున్నట్లు కూడా వార్తలు వస్తున్నాయి.



## ఈషా లుక్స్ అదుర్స్

### లెహంగాలో తెలుగమ్మాయి

టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తెలుగమ్మాయి ఈషా రెబ్బా. 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' సినిమాతో కెరీర్ మొదలుపెట్టిన ఈ భామ, అటు క్లాస్ సినిమాల్లోనూ, ఇటు గ్లామర్ పాత్రల్లోనూ మెప్పిస్తూ వస్తోంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా సోషల్ మీడియాలో తన ఫాలోవర్లకు మాత్రం ట్రీట్ ఇవ్వడం అస్సలు మర్చిపోదు. తాజాగా ఈషా షేర్ చేసిన గ్రీన్ లెహంగా ఫొటోలు ఇప్పుడు నెట్టింట మంటలు రేపుతున్నాయి. సింపుల్ లుక్‌లో కనిపిస్తూనే తన అద్భుతమైన ఫిజిక్ ఎలివేట్ అయ్యేలా ఈషా ఇచ్చిన పోజులు చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. సాధారణంగా ఈషా రెబ్బా ట్రెడిషనల్ వేర్ ధరించినా అందులో ఒక మోడ్రన్ టచ్ ఉండేలా జాగ్రత్త పడుతుంది. తాజా ఫొటోషూట్‌లో ఆమె ధరించిన గ్రీన్ లెహంగా ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేసింది. తన ఫిజిక్ పర్ఫెక్ట్‌గా ఎలివేట్ అయ్యేలా ఆమె ఇచ్చిన ఐకానిక్ పోజులు ఇప్పుడు యూత్ గుండెల్లో సెగలు రేపుతున్నాయి. ముఖ్యంగా ఆమె చిరునవ్వు, ఆ కళ్ళల్లోని మెరుపు ఫొటోలకు ప్రాణం పోశాయి. సోషల్ మీడియాలో ఈ ఫొటోలు చూసిన వారంతా "సింపుల్ లుక్‌లోనే స్టన్నింగ్‌గా ఈషా" అంటూ కామెంట్లతో హోరెత్తిస్తున్నారు.

## రెడ్ డ్రెస్‌లో సోయగాల మీనూ

### అభిమానులకు కనువిందు

టాలీవుడ్‌లో ఇప్పుడు ఎక్కడ చూసినా మీనాక్షి చౌదరి పేరే వినిపిస్తోంది. అందం, అభినయం కలగలిపిన ఈ ముద్దుగుమ్మ వరుస హిట్లతో దూసుకుపోతోంది. కేవలం సినిమాల్లోనే కాకుండా సోషల్ మీడియాలో కూడా అమ్మడు చేసే సందడి అంతా ఇంతా కాదు. తాజాగా రెడ్ కలర్ డ్రెస్సులో మీనాక్షి షేర్ చేసిన ఫొటోలు నెట్టింట సెగలు పుట్టిస్తున్నాయి. ఆ ఎర్రటి డ్రెస్సులో మెరిసిపోతున్న ఆమెను చూసి ఫ్యాన్స్ 'రెడ్ డ్రెస్ అందాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్న మీనూ' అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా తన ఫాలోవర్ల కోసం క్రమం తప్పకుండా సోషల్ మీడియాలో అప్‌డేట్స్ ఇస్తూనే ఉంటుంది మీనాక్షి. తాజాగా ఇన్ స్టాగ్రామ్ లో ఆమె పోస్ట్ చేసిన రెడ్ డ్రెస్ ఫొటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఆ డ్రెస్సులో ఆమె కనిపిస్తున్న తీరు, ఆ కాన్ఫిడెన్స్ చూస్తుంటే నిజంగానే మతి పోగొట్టేలా ఉంది. ట్రెడిషనల్ లుక్‌లో అయినా, ఇలాంటి హాట్ మోడ్రన్ లుక్‌లో అయినా మీనాక్షి స్టైల్ చాలా క్లాసీగా ఉంటుంది. అందుకే ఆమె ఫాలోవర్స్ సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. బ్యూటీ విత్ బ్రెయిన్ అని మీనాక్షిని చూస్తే అర్థమవుతుంది. స్పోర్ట్స్ నుంచి గ్లామర్ వరల్డ్ వరకు దేనిలోనైనా సరే తాను నంబర్ వన్ అని నిరూపించుకుంటోంది. సంక్రాంతి హిట్ తో ఇండస్ట్రీలో గోల్డెన్ లెగ్‌గా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీ, రాబోయే రోజుల్లో మరిన్ని పెద్ద ప్రాజెక్టులతో మన ముందుకు రాబోతోంది. మీనాక్షి ఇలాగే తన అందం, చందంతో మరిన్ని సక్సెస్ లు అందుకోవాలని కోరుకుందాం.




Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197